నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 21-3-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 201 పేజీలు: 4 వెల: రూ.1/-

న్యాయం వర్ధిల్లింది : ప్రధాని మోదీ

హైదరాబాద్, మార్చి 20: నిర్భయ గ్యాంగ్ రేప్ కేసులో నలుగురు దోషుల్ని ఇవాళ ఉరి తీశారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. న్యాయం వర్ధిల్లిందని ఆయన తన ట్వీట్‌లో తెలిపారు. మహిళల భద్రత, గౌరవానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాల్సిన సందర్భం వచ్చిందన్నారు. మన నారీశక్తి ప్రతి రంగంలో ఉత్తమంగా రాణిస్తోందన్నారు. మహిళా సాధికారతతో దేశాన్ని పురోగమించే విధంగా చూడాలన్నారు. సమానత్వం, అవకాశాలకు పెద్ద పీట వేయాలన్నారు.

న్యాయం గెలిచినట్లు కాంగ్రెస్ పార్టీ కూడా తన ట్విట్టర్‌లో పేర్కొన్నది. క్రూరమైన నేరాలకు పాల్పడుతున్న వారికి కూడా ఇలాంటి శిక్షనే అమలు చేయాలని ఆ పార్టీ సూచించింది. ఒక్క నిందితుడు కూడా శిక్ష నుంచి తప్పించుకోరాదు అంటూ ఆ పార్టీ అభిప్రాయపడింది.

నిర్భయ దోషులకు మరణదండన అమలు

నలుగురిని ఒకేసారి ఉరితీసిన తలారి జల్లాద్
తీహార్ జైలు 3వగదిలో వేకువ జామున శిక్ష అమలు
సరిగ్గా ఉదయం 5.30 గంటలకు ఉరికొయ్యకు వేలాడిన దోషులు
అరగంటపాలు ఉరికొయ్యకు వేలాడిన శవాలు
రాత్రంతా నిద్రపోకుండా గడిపిన దోషులు
ఉదయమే స్నానం చేయడానికి నిరాకరణ
టిఫిన్ కూడా వద్దని నివారించినట్లు వెల్లడి
ఉరి అమలును ధృవీకరించిన జైలు అధికారి సందీప్ గోయల్
పోస్ట్ మార్టమ్ కోసం శవాలు దీన్‌దయాల్ ఆస్పత్రికి తరలింపు

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): ఒక అంకం ముగిసింది. ఎనిమిదేళ్లుగా చట్టం కోరల నుంచి తప్పించుకునే యత్నం చేసిన దుర్మార్గుల చరిత్ర ముగిసింది. తెల్లవారుతున్న వేళ వారి బతుకు చీకట్లో కలిసిపోయింది. ఎంతోకాలంగా మృత్యువు వెన్నాడుతున్నా ..నిర్భయంగా బతికేసిన వారు ఇక బతక్కుండా చేశారు.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ కేసులో దోషులు నలుగురికి ఏకకాలంలో మరణదండన అమలు చేశారు. దోషులుగా తేలిన ముఖేశ్ సింగ్, పవన్ గుప్తా, అక్షయ్ ఠాకూర్, వినయ్ శర్మలను తీహార్ జైలులో శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటలకు ఉరి తీశారు. జైలు అధికారుల సమక్షంలో మీరట్ నుంచి వచ్చిన తలారి పవన్ జల్లాల్ ప్రత్యేకంగా తెప్పించిన మనీలా తాళ్లతో ఉరి తీశారు. దక్షిణాసియాలోనే అతి పెద్దదైన తీహార్ కేంద్ర కారాగారంలో ఒకే నేరానికి సంబంధించి నలుగురిని ఉరి తీయడం ఇదే మొదటిసారి. ఉరిశిక్షను తప్పించుకునేందుకు చివరి వరకు దోషులు చేసిన ప్రయత్నాలన్నీ విఫల మయ్యాయి. నిర్భయ దోషులకు ఇక ఎటువంటి చట్టపరమైన అవకాశాలు మిగిలిలేవని ఢిల్లీ కోర్టు గురువారం స్పష్టం చేయడంతో ఎట్టకేలకు ఉరిశిక్ష అమలు చేశారు. దోషులను ఉరి తీయడంపై నిర్భయ తల్లిదండ్రులు హర్షం ప్రకటించారు. తమకు న్యాయం జరిగిందని, నిర్భయ ఆత్మకు శాంతి చేకూరిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే గురువారం రాత్రి వరకు హైడ్రామా నడిచింది. వారి ఉరిని ఆపేందుకు దోషుల తరఫున వకాల్తా పుచ్చుకున్న లాయర్ ఎపి సింగ్ ప్రయత్నించారు. రాత్రి 11గంటల వరకు ఆయన కోర్టు తలుపుతట్టి , స్టే తెచ్చే ప్రయత్నం సినిమాను తలపించింది. అయితే డెత్ వారెంట్ ఫైనల్ అని కోర్టు ఖరాఖండిగా చెప్పడంతో ఉరితీతకు ఉన్న దారులు మూసుకుపోయాయి. దీంతో జైలు అధికారులు ప్రత్యేక భద్రత మధ్య తెల్లవారు జామున ప్రత్యేక భద్రత మధ్య.. తీహార్ జైలు 3వ నంబర్ గదిలో నలుగురు దోషులకు ఏకకాలంలో ఉరి అమలు చేశారు. ఉరి అమలుకు ముందు నిర్భయ దోషులు చివరి కోరిక చెప్పలేదని తీహార్ జైలు అధికారులు వెల్లడించారు. వారు రాత్రంతా నిద్ర లేకుండా గడిపారని తెలిపారు. గత రాత్రి భోజనం చేయలేదని, ఉరి తీసే గంట ముందు బ్రేక్ ఫాస్ట్‌కు నిరాకరించారని పేర్కొన్నారు. ఉరి అమలు ముందు గురువారం రాత్రి వారిని విడివిగా ప్రత్యేక గదుల్లో ఉంచామని తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున 3:30 గంటలకు వారు నిద్ర లేచారని, అప్పటికే సుప్రీం కోర్టు వారి చివరి పిటిషన్‌ను కొట్టివేసిందని తెలిపారు.

దోషులను స్నానం చేయాలని కోరగా.. ఎవరూ అంగీకరించలేదని అన్నారు. కాగా, నిర్భయ దోషులు ముఖేష్ సింగ్ (32), పవన్ గుప్తా (25), వినయ్ శర్మ (26), అక్షయ్ కుమార్ సింగ్ (31)ను ఉదయం 5:30 గంటలకు తీహార్ సెంట్రల్ జైలులోని జైలు నెంబర్ 3లో ఉరితీసినట్లు వెల్లడించారు. సరిగ్గా 5:30 గంటలకు నిర్భయ దోషులను ఉరితీశామని తీహార్ జైలు అధికారి సందీప్ గోయల్ చెప్పారు. ఇకపోతే ఉరికి ముందు దోషులను నిర్భయ కుటుంబ సభ్యులకు చూపించామని జైలు అధికారులు చెప్పారు. ఉరి అమలు నేపథ్యంలో జైలంతా లాక్‌డౌన్‌లో ఉంచామని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. కారాగార సమయంలో పవన్, వినయ్, ముఖేష్ జైల్లో పనిచేశారని, వారు సంపాదించిన మొత్తం ఆయా కుంటుంబాలకు అందిస్తామని జైలు అధికారులు చెప్పారు. నిబంధనల మేరకు తలారి పవన్ జల్లాద్ దోషులను 30 నిముషాలపాటు ఉరికి వేలాడదీశాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

ఉరితీయొద్దని వేడుకున్న వినయ్

ఇదిలాఉండగా.. ఉరి అమలుకు ముందు వినయ్ కుమార్ ఉరి తీయొద్దని పోలీసులను వేడుకున్నట్టు తెలిసింది. ఉరి భయాల నేపథ్యంలో అతను గత ఫిబ్రవరిలో గోడకు తల బాదుకున్నట్టు సమాచారం.

అయితే నిర్భయ దోశులకు ఈ రోజు ఉరిశిక్ష విధిస్తున్న సమయంలో వారి మానసిక పరిస్థితి ఎలా ఉంది.. వారికి జీవితంపై ఆశలు ఉన్నాయా? మరికాసేపట్లో మరణిస్తామన్న సంగతి తెలిస్తే ఎవరికైనా ఎలా ఉంటుందో అన్న విషయం రకరకాల చర్చలు సోషల్ మీడియాలో సాగుతున్నాయి. అయితే నిర్భయ దోషులకు మాత్రం తమ మరణం తథ్యమని తెలుసు. దాన్ని సాధ్యమైనంత వరకూ వాయిదా వేయిద్దామని చూసి, విఫలమయ్యారు. చివరి క్షణాలు వచ్చేసరికి వారిలో మరణ భయం స్పష్టంగా కనిపించిందని జైలు అధికారి ఒకరు తెలిపారు. ఆ రోజు రాత్రి మొత్తం నిద్ర పోలేదట.. వారిని ఉరికంబానికి తీసుకు వెళ్తన్న సమయంలో మాత్రం తనను క్షమించాలని ముఖేశ్ సింగ్ పదేపదే జైలు అధికారులను వేడుకున్నాడని తెలుస్తోంది

.తనను ఉరి తీయవద్దని అడుగుతూ ఉంటే, అధికారులు మాత్రం అతని వ్యాఖ్యలను పట్టించుకోకుండా, తమ కర్తవ్యాన్ని నిర్వర్తించారు. అయితే ఉరిశిక్ష అమలు పరిచే సమయంలో అక్కడ ఐదుగురు మాత్రమే ఉన్నారట. జైల్లో ఉన్న సమయంలో అక్షయ్ ఏ పని చేయలేదట.. కానీ పవన్, వినయ్, ముఖేశ్ కూలీ పని చేస్తూ కొంత డబ్బు సంపాదించారట. ఆ సొమ్ము వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని అధికారులు వెల్లడించారు.

నిర్భయ దోషులు మరణించారని డాక్టర్ల ధ్రువీకరణ

తీహార్ జైలు, న్యూఢిల్లీ : నిర్భయ హత్యాచార కేసులో నలుగురు దోషులకు ఉరి తీసిన అనంతరం వైద్యులు పరిశీలించి వారు మరణించారని ధ్రువీకరించారు. శుక్రవారం ఉదయం నిర్భయ దోషులైన ముఖేశ్ సింగ్(32), వినయ్ శర్మ(26), అక్షయ్ ఠాకూర్ సింగ్(31), పవన్ గుప్తా(25) లకు ఉరివేసిన తర్వాత 30 నిమిషాల పాటు అలా ఉరికంబాలపై ఉంచారు. అనంతరం నలుగురు దోషులను కిందకు దించి వారిని వైద్యులు పరీక్షించగా నలుగురూ మరణించారని తేలింది.

మహిళలకు ఊరట

దేశంలో ఓ ఆడపడుచుకి ఇన్నాళ్లకు న్యాయం జరిగింది.. కన్నూ మిన్నూ కానకుండా కామంతో రగిలిపోయి.. అన్యాయంగా ఓ యువతి పై అత్యాచారం చేసి ఆమె ప్రైవేట్ పార్ట్స్ ని దారుణంగా హింసించి ఆమె మరణానికి కారణం అయిన నింధితులకు ఉరిశిక్ష విధించారు. ఎంతో భవిష్యత్ ఊహించుకొని పారామెడిస్ చేస్తున్న ఓ యువతి జీవితాన్ని ఛిత్రం చేసి భూలోకంలోనే యమలోకాన్ని చూపించిన నిర్భయ నింధితులకు ఉరిశిక్ష పడటంతో దేశ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఎంతో మంది నింధితులు ఆడవారిపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు చేస్తున్న నిర్భయ నింధితులకు ఉరిపడ్డట్టే వారికి కఠిన శిక్ష అమలు చేయాలని మహిళాలో లోకం కోరుకుంటుంది.

కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగిస్తాం

తీహార్ జైలు డైరెక్టర్ సందీప్ గోయల్

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): నిర్భయ దోషుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తీహార్ జైలు అధికారులు దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆసుపత్రికి తరలించారు. భారీ సాయుధ పోలీసుల బందోబస్తు మధ్య ముఖేశ్ సింగ్, వినయ్ శర్మ, అక్షయ్ ఠాకూర్ సింగ్, పవన్ గుప్తా మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం దోషుల కుటుంబాల నుంచి లిఖితపూర్వ హామీతో డెడ్ బాడీలను వారికి అప్పగించనున్నారు. ఈ మేరకు ముందుగా నిర్భయ దోషుల మృతదేహాలను దీన్‌దయాళ్ ఆసుపత్రికి తరలించారు. వారి మృతదేహాలకు శవ పరీక్షలు నిర్వహించిన అనంతరం జైలు అధికారులు వాటిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తారని తీహార్ జైలు డైరెక్టర్ జనరల్ సందీప్ గోయల్ మీడియాకు తెలిపారు. ఈ రోజు ఉదయం 5.30 గంటలకు నిర్భయ దోషులను ఉరితీయగా 8.20 గంటలకు అక్కడి నుంచి జైలు అధికారులు దోషుల మృతదేహాలను డీడీయే ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలకు అంతిమ యాత్ర వంటివి నిర్వహించకూడదని కుటుంబ సభ్యులకు అధికారులు సూచించారు. అక్షయ్ సింగ్, పవన్ గుప్తా, వినయ్ శర్మ, ముకేశ్ సింగ్ కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేసుకున్నారు.

మైనర్‌గా విడుదలయిన ఆరో వ్యక్తి ఎక్కడ?

రహస్య జీవితం గడుపుతున్నట్లు సమాచారం

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): నిర్భయ గ్యాంగ్ రేప్‌లో నిందితుడిగా ఉన్న ఓ మైనర్ ఇప్పుడు ఎవరికీ తెలయకుండా రహస్య జీవితం గడుపుతున్నట్లు సమాచారం. రేప్ కేసులో ఉన్న అతడిని మూడేళ్లు జువైనల్ జైలులో శిక్ష వేశారు. అనంతరం రిలీజయ్యాక ఇప్పుడు రమస్యంగా జీవితం గడుపుతున్నాడని సమాచారం. అయితే పోలీసులు మాత్రం అతని కదలికలపై నిఘా ఉంచారని తెలుస్తోంది. ఎప్పుడో జైలు నుంచి రిలీజైన అతను ఎక్కడ ఉన్నాడో ప్రపంచానికి తెలియకుండా గడుపుతున్నాడు. ఆ నిందితుడు దక్షిణ భారత దేశంలో .. ఎవరూ గుర్తుపట్టని ప్రాంతంలో పనిచేస్తున్నట్లు అధికారులు చెప్పారు. నిర్భయ గ్యాంగ్ రేప్ కేసులో దోషులుగా ఉన్న నలుగర్ని శుక్రవారం ఉరి తీశారు. మొత్తం ఆరుగురు నిందితుల్లో రామ్ సింగ్ అనే అతను జైలులో ఉరి వేసుకుని చనిపోయాడు. ఇక ఆ కేసులో నిందితుడిగా ఉన్న మైనర్ ప్రస్తుతం రహస్య జీవితాన్ని గడుపుతున్నాడు. ఢిల్లీకి 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ గ్రామానికి చెందిన ఆ మైనర్ .. గ్యాంగ్ రేప్ జరిగిన రోజున అక్కడే ఉన్నాడు. అతను కూడా క్రూరంగా రేప్‌కు పాల్పడినట్లు తెలిసింది. బస్సు ఓనర్ అయిన రామ్ సింగ్.. ఆ మైనర్‌కు క్లీనర్‌గా ఉద్యోగం ఇప్పించాడు. 11 ఏళ్లకే ఇల్లు వదిలి వచ్చిన ఆ మైనర్‌ను రామ్ సింగ్ చేరదీశాడు. రేప్ కేసులో దోషిగా తేలిన మైనర్‌ను కొన్నాళ్లు జైలులో ఉంచారు. ఆ తర్వాత అతన్ని రిలీజ్ చేశారు. అయితే ఢిల్లీకి దూరంగా అతన్ని పంపినట్లు పోలీసులు చెబుతున్నారు. అతని ఆనవాళ్లు ఎవరికీ తెలియదు. ఎప్పుడూ అతని ముఖాన్ని కప్పివేయడం వల్ల ఆ మైనర్‌ను ఎవరూ గుర్తుపట్టలేరు. ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో అతను ఓ వంటవాడిగా జీవితాన్ని గడుపుతున్నట్లు తెలిసింది. జైలులో ఉన్నప్పుడు ఆ మైనర్ వంట నేర్చుకున్నాడు. అతనిపై పోలీసులు ఎప్పుడూ నిఘా పెట్టి ఉన్నట్లు తెలుస్తోంది.

తప్పు చేస్తే శిక్ష తప్పదు

చివరికి న్యాయమే

గెలిచిందన్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ):నిర్భయ దోషులకు ఉరి శిక్ష పడాలన్న దేశ వ్యాప్త డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. శుక్రవారం ఉదయం 5గంటల 30 నిమిషాలకు నలుగురు దోషులను తీహార్ జైలు అధికారులు ఉరి తీశారు. దీనిపై దేశ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్భయ దోషుల ఉరిశిక్ష అమలుపై ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్ వేదికగా స్పందించారు. 'చివరికి న్యాయమే గెలిచింది. మన నారీమణులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. వారికి భద్రతతో పాటు మరింత గౌరవాన్ని పెంచాల్సిన అవసరముంది. అన్ని రంగాల్లో సమానత్వం, అవకాశాల కల్పన ఎంతో ముఖ్యం. మహిళా సాధికారత దిశగా దేశం అడుగులు వేయాలి. దీనికి అందరూ కృషి చేయాలి' అని పేర్కొన్నారు. మరోవైపు నిర్భయ దోషులకు ఉరి అమలుపై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ స్పందించారు. ఆలస్యం అయినప్పటికీ దోషులకు శిక్షం పడటం సంతోషకరమన్నారు. తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష పడుతుందన్నారు.

నిర్భయ ఘటనలు జరక్కుండా చూస్తామన్న కేజ్రీవాల్

నిర్భయ దోషుల ఉరిపై హర్షం వ్యక్తం చేసిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్.. మరో నిర్భయ ఘటన జరగకుండా యావద్దేశం ప్రతిజ్ఞ చేయాలన్నారు. దోషులకు శిక్ష పడడానికి ఏడుళ్లు పట్టిందన్న ఆయన ..పోలీస్, న్యాయవ్యవస్థలోని లోపాలను సంస్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని నెలలుగా చట్టాన్ని అపహాస్యం చేసిన దోషులకు..సరైన శిక్ష పడిందన్నారు. మహిళల రక్షణ కోసం ఢిల్లీ ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తెస్తామని.. భద్రతను మరింత పెంచుతామని ఢిల్లీ సీఎం తెలిపారు

చరిత్రలో నేటినిజం

కం॥ మునిషిని మునిషిగ జూచెడి
జనతంత్రము కొరకు పెదుకు చైతన్యముగా
ఘనకీర్తిని బొందిన - కా
రణ జన్ముని "మాన వేంద్ర రాయు"ని దలతునే!!

(మార్చి 21 ఎం.ఎన్.రాయి (మానవేంద్ర నాథ్‌రాయ్) జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

కరోనా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు

అన్ని విమానాశ్రయాల్లో పరీక్షలు
దేశ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా
సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులు ఏర్పాటు
విదేశాల్లో ఉన్న రాయబారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు
సముద్ర మార్గాలపైనా నిషేధం అమలు
మంత్రుల టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన కేంద్రం
కరోనాపై ప్రజలు ఆందోళన చెందవద్దు: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందవద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామని కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్రాల్లో పర్యవేక్షణ కోసం జాయింట్ సెక్రటరీలను నియమించామని తెలిపారు. జనవరి 26 నుంచి అన్ని విమానాశ్రయాల్లో పరీక్షలు ప్రారంభించామని పేర్కొన్నారు. కరోనా అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఓడల ద్వారా వచ్చే సరకు రవాణాను నిషేధించామని వెల్లడించారు. విదేశాల్లో ఉన్న రాయబారులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామని తెలిపారు. దేశ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా పెట్టామని తెలిపారు. మనీలాలో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను వెనక్కి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలలో సామూహిక ప్రార్థనలు సాధ్యమైనంత వరకు తగ్గించాలని కోరారు. కరోనా నేపథ్యంలో జనగణనను వాయిదా వేస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు.

కేంద్రం తీసుకున్న చర్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆయన ఇంట్లో బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. ఇప్పటివరకు 16 సమీక్ష సమావేశాలు నిర్వహించామని.. కరోనా అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇతర దేశాల్లో జరిగిన తప్పులు ఇక్కడ జరగొద్దన్నారు. మంత్రుల టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. విదేశాల్లో ఉన్న రాయబారులతో

ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామని.. ఓడల ద్వారా వచ్చే సరుకు రవాణాను నిషేధించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. కరోనా వ్యాప్తిని అరికట్టడం కోసం దేశ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కరోనాపై అన్ని చర్యలు తీసుకుంటుందని.. కరోనా గురించి ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన కోరారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 195 కేసులు నమోదయ్యాయి. అందులో ఇండియాకు చెందిన వారు 163, విదేశాలకు చెందిన వారు 32 మంది ఉన్నారు. కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జ్ అయిన వారు కూడా ఉన్నారు. దేశవ్యాప్తంగా 69 వేల మంది హోం క్వారంటైన్‌లో ఉన్నారు. కరోనా పరిస్థితులపై పార్లమెంట్‌లో ఆరోగ్యమంత్రి ప్రకటన కూడా చేశారు. అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రతిరోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు కేబినెట్ సెక్రటరీ 22 సమావేశాలు నిర్వహించారు. ఇతర దేశాలలో జరిగిన తప్పులు మన దగ్గర జరగకూడదన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 16 రివ్యూ మీటింగ్‌లు నిర్వహించింది. ఓడల ద్వారా వచ్చే సరుకు రవాణాను నిషేధించాం. దేశ సరిహద్దులో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశాం. సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. కేవలం 20 రోడ్లను మాత్రం తెరచి ఉంచాం. ఆ రోడ్ల ద్వారానే రవాణా సాగాలి. మంత్రులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. విదేశాల్లో ఉన్న భారత రాయబారులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూనే ఉన్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నవారికి కూడా వైద్య సేవలు అందిస్తున్నం. కరోనా బాదితుల గుర్తింపు కోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేశాం. వివిధ దేశాల సరిహద్దులో ఉన్న జిల్లాల్లోని 4, 645 గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నాం. ఈ గ్రామసభల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం 8 టీంలను ఏర్పాటు చేసింది. విదేశాలలో ఏవైతే చర్యలు తీసుకుంటున్నారో తెలుసుకొని మన దగ్గర కూడా అమలు చేస్తున్నట్లు వివరించారు. విదేశాల నుంచి వచ్చే వారిని పరీక్షించిన తర్వాతే పంపిస్తున్నాం. కరోనా టెస్టుల కోసం ప్రైవేట్ ఆస్పత్రులను కూడా ఉపయోగిస్తున్నాం. పాజిటివ్ వచ్చిన పేషంట్లకు నెగిటివ్ వచ్చిన తర్వాతే ఇంటికి పంపించాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. ప్రభుత్వ ఆఫీసులకు సందర్శకులు రావద్దని సూచించాం. ఇప్పటివరకు ఎయిర్ పోర్టులలో 14 లక్షల 30,000 మందికి స్క్రీనింగ్ చేశాం. దేశంలో హాస్పిటల్స్ సరిపోకపోతే ఆయా ప్రాంతాలలో ఉన్న స్కూళ్లను, కాలేజీలను కూడా వాడుకుంటాం. 260 మందికి కరోనా గురించి శిక్షణ ఇచ్చి ఆయా రాష్ట్రాలకు పంపించాము. ప్రతి రాష్ట్రంలోనూ టోల్ ఫ్రీ నెంబర్స్ అందుబాటులో ఉంచాం. మార్చి 18 నుంచి ఇతర దేశాలనుంచి వచ్చేవారిని నిషేధించాం. కోవిడ్ 19 నెగిటివ్ సర్టిఫికెట్ ఉన్న వారిని మాత్రమే దేశంలోకి రానిస్తామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రోస్టర్ విధానం

ప్రభుత్వ ఉద్యోగులకు వీక్లీ రోస్టర్ అమలు చేయాలని నిర్ణయించాం. 50 శాతం ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇవ్వాలని నిర్ణయించామని కేంద్రమంత్రి అన్నారు. సాధ్యమైనంత వరకు ప్రైవేట్ కంపెనీలు కూడా వర్క్ ఫ్రం హోం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వ ఆఫీసులలో బయోమెట్రిక్ విధానాన్ని తాత్కాలికంగా నిలిపివేశాం. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు బయోమెట్రిక్ వాడొద్దని సూచించాం. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా.. ప్రైవేట్ ఉద్యోగులకు కూడా శాలరీ కటింగ్ లేకుండా ఇవ్వాలని కార్మికశాఖ ద్వారా ఉత్తర్వులు ఇచ్చాం. ప్రైవేట్ ఉద్యోగులను ఆఫీసుకు రాకపోతే జీతాలు కట్ చేస్తామని వేధించొద్దు. అన్ని రాష్ట్రాలకు ఆయా రాష్ట్ర భాషలలో కరపత్రాలు పంపి ప్రజలలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరాం. ఆరోగ్య శాఖకు సంబంధించిన ఏ డబ్బులైనా సరే.. కరోనా కోసం వాడుకోవచ్చు.

నిత్యావసర వస్తువులు, శానిటైజర్లు, మాస్కులు బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. కరోనా నివారణకు ప్రజలందరూ సహకరించాలి. కరోనాకు మందు లేదు కాబట్టి దాన్ని రాకుండా అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలను కోరుతోందన్నారు.

కరోనాపై చర్యలకు సహకరించాలి

ఇతర దేశాల నంచి వచ్చిన వారిని క్వారంటైన్‌కు తీసుకువెళ్తామంటే.. వారంతా ధర్నాలు చేస్తున్నారు. అలా కాకుండా అందరూ అధికారులకు సహకరించాలి. కరోనాపై అంతిమ విజయం మనదే కావాలి. ప్రధాని మోడీ పిలుపు మేరకు ప్రజలంతా జనతా కర్ఫ్యూలో పాల్గొనాలి. మార్చి 22న ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు జనతా కర్ఫ్యూ విధించుకొని ఇంట్లోనే ఉండాలి. ఆరోజు రోడ్డు మీదకు ఎటువంటి వాహనాలు రాకూడదు. రాజకీయాలకు అతీతంగా పార్టీలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కరోనా నివారణకు కలిసి పనిచేయాలని కోరుతున్నాం అని ఆయన అన్నారు.కాగా.. అందుకు వ్యతిరేకంగా దేశంలోని పార్టీలన్నింటిని ఒకే తాటిపైకి తెస్తానని తెలంగాణ సీఎం కేసీఆర్ అంటున్నారని.. దానిపై మీ అభిప్రాయం ఏంటని విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. ముందు కరోనాని అరికట్టాలని ఆయన కోరారు. కేసీఆర్ కరోనా కట్టడి కాకముందే అందరిని ఆ వైపుకు మళ్లిస్తే కరోనా వ్యాప్తి అధికమవుతుందని కిషన్ రెడ్డి ఎద్దేవాచేశారు.

నిర్భయ కేసులో ఎట్టకేలకు న్యాయం జరిగింది

తమ బిడ్డ ఆత్మ శాంతిస్తుందన్న తల్లిదండ్రులు
ఇకముందు అభాగ్యుల పక్షాన పోరాడుతానన్న ఆశాదేవి
ఉరి తీసినందుకు ఆనందంగా ఉందన్న తలారి పవన్ జల్లాద్

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): నిర్భయ హత్యాచారం కేసులో నలుగురు దోషులకు ఎట్టకేలకు శుక్రవారం ఉదయం ఉరిశిక్ష అమలు చేయడంతో బాధితురాలి తల్లిదండ్రులు ఆశాదేవి, బద్రీనాథ్ సింగ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఆలస్యంగా అయినా తమ కూతురు ఆత్మ సంతోషించిందని ఉరితీతపై భావోద్వేగంతో స్పందించారు. ఢిల్లీలోని తిహార్ సెంట్రల్ జైలులో నలుగురు నిర్భయ దోషులను ఉరితీసిన కొద్దిసేపటికే శుక్రవారం ఉదయం బాధితురాలి తల్లి ఆశాదేవి మీడియాతో మాట్లాడారు. తన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారించినందుకు న్యాయవ్యవస్థకు, ప్రభుత్వానికి ఆశాదేవి కృతజ్ఞతలు తెలిపారు.నిర్భయ కేసు తీర్పు మహిళలు సాధించిన విజయమని, తన కుమార్తెకు న్యాయం జరిగిందని బాధితురాలి తండ్రి బద్రీనాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. దోషులను ఉరి తీయడానికి సమయం పట్టి ఉండవచ్చు, కానీ చివరికి న్యాయం జరిగిందని ఆశాదేవి చెప్పారు. సుదీర్ఘ పోరాటం అనంతరం మాకు న్యాయం జరిగింది. దోషులకు ఉరి తీసిన రోజు కుమార్తెలకు అంకితం చేస్తున్నాను. న్యాయవ్యవస్థ, ప్రభుత్వానికి కృతజ్ఞతలని ఆశాదేవి పేర్కొన్నారు. తన కూతురైతే తిరిగి రాదని, కాని అత్యాచార బాధితురాళ్ల కోసం తాను భవిష్యత్ లోనూ పోరాడుతానని ఆశాదేవి చెప్పారు. తన కుమార్తె చిత్రప టాన్ని హగ్ చేసుకున్న ఆశాదేవి చివరికి నీకు న్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. ఇకముందు ఇలాంటి అభాగ్యుల పక్షాన తనపోరాటాన్ని కొనసాగిస్తానని అన్నారు. మరోవైపు ఉరితీసినందుకు తలారి పవన్ జల్లాద్ కూడా ఆనందం వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా ఈ క్షణం కోసం ఎదురుచూస్తున్నానని అన్నారు. నిర్భయ హత్యాచారం కేసులో నలుగురు దోషులను ఉరి తీసిన తలారీ పవన్ జల్లాద్ కీలక వ్యాఖ

స్వచ్ఛత వ్యవస్థీకృతం కావాలి..!

నేటినిజం
శనివారం 21-3-2020

'ఏకాంతం'-ఐసోలేషన్- 'కరోనా' నిరోధక, 'కరోనా' నిర్మూలక చికిత్సలో వౌలిక అంశమైపోయింది! దశాబ్దుల తరబడి ఒకదాని తరువాత మరొకటిగా ప్రపంచాన్ని ముంచెత్తుతున్న చిత్రవిచిత్ర భయంకర వ్యాధులలో ఈ 'కరోనా' పరాకాష్ఠ. ఇంతగా ప్రపంచాన్ని భయవిభ్రాంతికి గురిచేసిన వ్యాధి మరొకటి లేదు. ఇంత పెద్ద ఎత్తున ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవలసిన అనివార్యం గతంలో ప్రబలిన విచిత్ర వ్యాధులు కల్పించలేదు! పాఠశాలలు మూసివేశారు, విమానాల రాకపోకలను రద్దుచేస్తున్నారు, ఎక్కువ సంఖ్యలో జనం కలిసే సభలను, సమావేశాలను, ఉత్సవాలను, శోభాయాత్రలను, జాతరలను, సమ్మేళనాలను రద్దుచేశారు. మన ప్రధానితో సహా వివిధ దేశాల ప్రభుత్వ నేతలు విదేశాల పర్యటనలు రద్దుచేసుకున్నారు. కేంద్ర మంత్రులు విదేశాలకు పోరాదట! కొన్ని దేశాలలో జనం ఇళ్లనుంచి బయటికి రాకుండా ప్రభుత్వాలు కట్టడి చేశాయి. దేవాలయాలు సైతం మూతపడుతుండడం సమస్య తీవ్రతకు పరాకాష్ఠ. అనేక దేశాలలో ఎన్నికలు వాయిదాపడినాయి. మన దేశంలో కూడ ఇదే కథ నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాకు కారణం చెలరేగిన రాజకీయ దౌర్జన్యకాండ కంటె, 'కరోనా' ప్రమాదం ప్రధాన కారణం! ఒకరికొకరు దూరంగా ఉండాలన్నది చికిత్స, కరచాలనాలు, బహిరంగ ఆలింగనాలు రద్దయిపోయాయి. చివరికి మన చేతులతోనే మన ముక్కును, మన కళ్లను, మన చెవులను, మన చెంపలను ముట్టరాదన్నది 'కరోనా'హడలెత్తిస్తున్న తీరునకు నిదర్శనం! ఉన్నత న్యాయస్థానాలు కేవలం అత్యవసర అనివార్య వివాదాలను మాత్రమే విచారిస్తుండడం కరోనా ప్రమాదంపై ప్రకటించిన యుద్ధప్రాధాన్యానికి ధ్రువీకరణ...ప్రమాదం, వైపరీత్యం, విలయం, ప్రాకృతిక బీభత్సం తరుణం ఇది. ఈ 'సమన్వయం' మన వివిధ అలవాట్లమధ్య, పద్ధతుల మధ్య, ఆలోచన రీతుల మధ్య, ప్రవృత్తుల మధ్య జరగాలి! మనిషికీ మనిషికీ మధ్య సమన్వయం కలిగి ఉండడం ఉత్తమ కుటుంబం. కుటుంబ జీవన పద్ధతుల మధ్య సమన్వయం హార్మోనీ సామాజిక సమన్వ యం. ..సమాజానికీ ప్రకృతికీ మధ్య సమన్వయం సృష్టివికాస క్రమం! "అఖండ మండలాకార"మైన విశ్వవ్యవస్థలో ఏ బిందువు స్వచ్ఛత చెడిపోయినప్పటికీ మొత్తం విశ్వవ్యవస్థ స్వచ్ఛత భంగపడడానికి అది క్రమక్రమంగా దోహదం చేస్తోంది! మానవుడు విశ్వవ్యవస్థలోని అనేక 'బిందువుల'లో ఒకడు. మానవ సమాజం, ధరాతల జీవజాలంలో ఒక ప్రధాన అంశం... జీవజాలం ప్రకృతి! అందువల్ల ప్రధాన అంశమైన మానవ జీవనం స్వచ్ఛతను కోల్పోతూ ముంచుకొని వచ్చినప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.. .కానీ ఇవి ముంచుకొని రాకుండా ఇలాంటివి, ఇలాంటి రోగాలు పుట్టకుండా శాశ్వతంగా నిరోధించే సమన్వయ జీవన విధానాన్ని మనం తప్పనిసరి చేసుకోలేమా?? అన్న మథనం జరుగవలసిన ఉండడం ప్రకృతి క్రమంగా గాయపడుతుండడానికి కారణం. గాయపడుతున్న ప్రకృతి గాయపరుస్తోంది! అందువల్లనే గతంలో ఊహించని రోగాలు, రోగక్రిములు ఇతరేతర విచిత్రాలు విరుచుకొని పడుతున్నాయి. ఒకదాన్ని నిరోధించి నిర్మూలించిన వెంటనే మరి ఒక విచిత్ర రోగం విస్తరిస్తోంది. ఇలా ఒకటి కాదు. ఇంకా ఇంకా ఎన్నో జబ్బులు! వ్యాధి వచ్చిన తరువాత చికిత్స చేయవచ్చు, కానీ వ్యాధి రాకుండా, ప్రకృతి రుగ్మతకు గురికాకుండా నిరోధించ గల జీవనరీతి మళ్లీ సమాజంలో వ్యవస్థితం ఎందుకు కారాదు?? ఒకప్పుడు, సహస్రాబ్దుల తరబడి, ఇలాంటి సమన్వయ జీవన పద్ధతి మన దేశంలో వ్యవస్థీకృతమై ఉండేది! మానవుడు, కుటుంబంలోను, కుటుంబం సమాజంలోను, సమాజం ప్రకృతిలోను, ప్రకృతి విశ్వవ్యవస్థలోను అవిభాజ్యం అన్న జీవన పద్ధతి స్వచ్ఛతను కాపాడింది! ఈ జీవన స్వచ్ఛత కలిగిన భారతీయులు ప్రాకృతిక స్వచ్ఛతను విశ్వవ్యవస్థ సమన్వయాన్ని రక్షించారు! ఇలా రక్షణ పొందిన ప్రకృతి ప్రజలను కాపాడింది. చేతులు మాత్రమే కాదు రోజంతా అప్పుడప్పుడు చేతులను, కాళ్లను, ముఖాన్ని మొత్తం శరీ రాన్ని కడగికొనడం ఈ దేశంలో జీవన విధానం. 'స్వచ్ఛత'ను రక్షించడం తాత్కాలిక చర్యగాకాక, శాశ్వత జీవన సహజ విధానంగా వ్యవస్థీకృతం కావాలి!

దోషుల తరనపున ఎపి సింగ్ వకాల్తా

నీచంగా చేసిన వ్యాఖ్యలపై ప్రజాగ్రహం

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): న్యాయవాదిగా ఉంటూ అన్యాయానికే సపోర్టు చేస్తూ ఏడు సంవత్సరాల పాటు అందరి చేత ఛీ కొట్టించుకున్న ఏపీ సింగ్ మరోసారి తన నీచమైన వ్యక్తిత్వాన్ని బయటపెట్టాడు. నిర్భయపై జరిగిన అఘాయిత్యం గురించి తెలుసుకుంటే ఎంత కఠినాత్ముడైన కన్నీళ్లు పెట్టుకుంటాడు. కానీ ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టిన దుర్మార్గులు భూమ్మీద బతకడానికి అర్హత లేదని తెలిసి కూడా ఏపీ సింగ్ వారి తరుపున మాట్లాడటం చాలా దురదృష్టకరం. ఇప్పటివరకు అతను నిర్భయ కేసు ద్వారా న్యాయ వ్యవస్థలో ఉన్న లోపాలను బయటపెట్టి చట్టసవరణలు చేయాల్సినవి ఎన్నో ఉన్నాయని పరోక్షంగా తెలియజేసారు. అయితే అదే సమయంలో అతను కేసు ఓడిపోయిన తరువాత అతడు నిర్భయపై చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయి. నిర్భయ రాత్రి 12:00 గంటల వరకు ఎందుకు ఒక మగవ్యక్తి తో బయట తిరుగుతుందో తన తల్లిని చెప్పమనండి. ఆమెకు తెలియదు తన బిడ్డ ఎక్కడికి వెళ్ళిందో ఏం చేస్తుందో అనేది కూడా అంటూ నిర్భయ క్యారెక్టర్‌ని తప్పు పడుతూ మధ్య వేలిని ఎత్తి చూపించాడు. దాంతో ఆయన మాటల్ని విన్న చాలా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ తిట్టిపోశారు. వాస్తవానికి రాత్రి సమయంలో బయటకు వచ్చిన ప్రతి మహిళని అత్యాచారం చేయొచ్చునట్టు మాట్లాడిన ఏపీ సింగ్ తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇటువంటి మనస్తత్వం ఉన్న ఏపీ సింగ్ రేపిస్టుల కంటే ప్రమాదకరమని, పనిలో పని ఇతన్ని కూడా నలుగురితో ఉరి తీసినట్టు అయితే బాగుండేదని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

ఉరితీయడంలో పవన్ జల్లాద్ ఎక్స్‌పర్ట్

అతడికి ముట్టే పారితోషికం కేవలం 80వేలు

ఉరితీత అనంతరం మానసిక స్థితిని పరీక్షించిన వైద్యులు

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): దోషులకు ఉరితీసేందుకు ప్రత్యేకంగా తలారులు ఉంటారు. ఎవరుపడితే వారు తీయడానికి అవకాశం లేదు. అందుకే నిర్భయ దోషులకు కూడా ప్రర్యేకంగా తలారిని పిలిపించారు.

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన పవన్ జల్లాద్.. నలుగురు నిర్భయ దోషుల్ని ఉరి తీశాడు. ఉరి తీయడంలో అతనే స్పెషలిస్టు. ఇతన్ని అందరూ పవన్ అని పిలుస్తారు. పవన్ తండ్రి కూడా జైళ్లలో ఉరి తీసేవాడు. మూడు తరాలకు చెందిన వారు ఆ వృత్తిలోనే కొనసాగారు. తమ పూర్వీకుల నుంచి ఉరి తీసే పద్ధతుల్ని పవన్ నేర్చుకున్నాడు. జైలు అధికారులకు కూడా పవన్‌పై అపార నమ్మకం. అతను ఉరి తీస్తే... అందులో ఎటువంటి పొరపాటు ఉండదని నమ్మకం. ఉరితీసే సమయంలో కొన్ని పద్ధతులు ఉంటాయి. అవి తెలిసిన వ్యక్తినే ఉరితీతకు ఎంచుకుంటారు. కసబ్,అఫ్జల్ గురుల ఉరితీత విషయంలోనూ ఇలాంటి పద్ధతులనే పాటించారు. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ గ్యాంగ్ రేప్ కేసులో శుక్రవారం నలుగుర్ని నిందితుల్ని ఉరి తీశారు. ఆ నలుగురికి ఉరి వేసింది పవన్ జల్లాద్. ఒక్క దోషిని ఉరితీసినందుకు పవన్ కు రూ.20 వేల వరకు మాత్రమే అందజేస్తామని జైలు అధికారులు తెలిపారు. తలారీకి నెలవారి వేతనం ఉండదని, కేవలం నెలకు రూ.3000 స్టైఫ్రండ్ మాత్రమే ఇస్తారని పవన్ జల్లాడ్ పేర్కొన్నారు. అదికూడా ఒక్కసారి ఇవ్వరని తెలిపారు. గతంలో ఓ జైలులో డబ్బులు తక్కువ ఇస్తున్నారని మరో జైలులో తలారీగా చేరి 2015లో పవన్ వార్తల్లో నిలిచాడు. ఉరిశిక్ష అమలు చేసిన తరువాత తలారీకి వైద్య పరీక్షలు నిర్వహించారు. పవన్ మానసిక పరిస్థితి పరీక్షించిన తరువాత అతడికి దృవపత్రం అందజేశారు. నలుగురు దోషులకు ఒకేసారి ఉరిశిక్ష అమలు చేశాడు కాబట్టి అతని ఆరోగ్య పరిస్థితి, మానసిక పరిస్థితి అంశాలు పరిశీలించిన తరువాత అతడిని ఎస్కార్టుతో పంపించి వేస్తారు. పవన్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం అతని ఆర్థిక జీవతం కష్టాల్లో ఉన్నది. పవన్ చిన్న కుమారుడు కూడా ఇదే వృత్తిని ఎన్నుకున్నట్లు తెలుస్తోంది.

కరీంనగర్ ప్రజలకు మంత్రి గంగుల కమలాకర్ భరోసా

కరీంనగర్, మార్చి 20 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్‌లో కరోనా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంత్రి నేడు కరీంనగర్ పట్టణంలో క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు భరోసా కల్పించారు. నగరం మొత్తం శానిటైజేషన్ చేపడుతున్నట్లు తెలిపారు. మన నగర భవిష్యత్ మన చేతుల్లోనే ఉందని.. మన నగరాన్ని మనమే కాపాడుకోవాలని సూచించారు. ప్రజలంతా సాధ్యమైనంత వరకు ఇండ్లకే పరిమితం కావాలన్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా ఉండొద్దన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాల్సిందిగా సూచించారు.

విదేశాల నుంచి వచ్చిన వారి సమాచారం తెలియజేయడం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేసినవారౌతరన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలు, ప్రజల సహకారంతోనే వైరస్‌ను నిర్మూలించడం సాధ్యమన్నారు. ఇండోనేషియా నుంచి వచ్చిన వారిలో తప్ప ఇప్పటి వరకు కొత్తవారిలో ఎవరిలోనూ కరోనా లక్షణాలు కనిపించలేదన్నారు. అయినప్పటికి మరో పది రోజులు అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. విదేశాల నుంచి వచ్చినవారు 15 రోజులు ఇంట్లోని ఉండి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలను, జబ్బులను దాచే ప్రయత్నం చేయొద్దన్నారు.

రేపు కరీంనగర్ పర్యటనకు సీఎం కేసీఆర్

హైదరాబాద్ , మార్చి 20: కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి తీసుకుంటున్న చర్యలను స్వయంగా పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శనివారం కరీనంగర్ పట్టణంలో పర్యటించనున్నారు. ఇండోనేషియా నుంచి కరీంనగర్ వచ్చిన కొద్దిమందికి కరోనా వైరస్ సోకినట్లు తేలడంతో అధికార యంత్రాంగం పట్టణంలో వైరస్ వ్యాప్తి నిరోధానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నది. ముఖ్యమంత్రి కూడా అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పలు సూచనలు చేస్తూ వచ్చారు.ఇండోనేషియా నుంచి వచ్చిన వారికి తప్ప, స్థానికులెవరికీ వ్యాధి సోకకుండా అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయి. కరీంనగర్ లో పరిస్థితిని స్వయంగా పరిశీలించి, పర్యవేక్షించేందుకు శుక్రవారమే ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనరగ్ లో పర్యటించాలని భావించారు. కానీ శుక్రవారం ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ఉండడంతో ఈ పర్యటన శనివారానికి వాయిదా పడింది. సిఎంతో పాటు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు కూడా కరీంనగర్ లో పర్యటిస్తారు. అక్కడే ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షా సమావేశం కూడా నిర్వహిస్తారు.

చట్టం లొసుగులు తెలియచేసిన నిర్భయ కేసు

హైదరాబాద్, మార్చి 20:దోషుల పక్షాన్నే న్యాయం ఉంటుందని నిర్భయ దోషుల విషయంలో మరోమారు రుజువయ్యింది. ఓ అభాగ్యురాలిపై సామూహిక అత్యాచారం చేసి...ఆమెకు మరణశాసనం రాసిన ఐదుగురు దోషులు ఏడేళ్లుగా నిర్భయంగా బతికిపోయారు. న్యాయం తమవైపే ...అన్నంతగా కోర్టుల మెట్లెక్కారు. భారత శిక్షాస్మృతిలో ఉన్న లొసుగులను ఆధారం చేసుకుని చావకుండా తప్పించుకునే యత్నాలు చివరి వరకు చేశారు. చివరకు గురువారం అర్ధరాత్రి వరకు కోర్టు తలుపులు తెరుచుకునేలా చేశారు. నిర్భయ దోషుల తరఫున వకాల్తా పుచ్చుకున్న లాయర్ ఎపి సింగ్ ...మన చట్టంలో ఉన్న లొసుగులను ప్రపంచానికి తెలియచేశారు. లొసుగుల ఆధారంగా ఉరిశిక్షను రద్దు చేయించేందుకు చివరి వరకు ప్రయత్నించారు. అత్యాచారం, హత్యలు వంటి ఘోరాలు చేసినా తప్పించుకునే వీలుందని రుజువు చేయబోయారు. నిర్భ దోషుల కేసు మన చట్టాల ఉనికిని ప్రశ్నించేలా చేసింది. మన చట్టాలను సంస్కరించు కోవాలని గుర్తు చేసింది. మొత్తంగా ఈ ప్రహసనం అంతా చరిత్రలోనే సంచలనంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అందుకే నిర్భయ దోషుల ఉరి దేశ చరిత్రలోనే ప్రత్యేకమైనదిగా మిగిలిపోతుంది. ఒకేసారి నలుగురు దోషులను ఉరితీసిన సంఘటనపై ప్రజలు, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నా... ఇంతకాలం ఎందుకు ఉరి తీయలేక పోయారన్న ప్రశ్నలు కూడా మనలను వేసుకునేలా చేసిందీ ఘటన. దేశవ్యాప్తంగా ఎనిమిది సంవత్సరాలుగా చర్చనీయాంశంగా మారిన నిర్భయ దోషులకు ఎట్టకేలకు శుక్రవారం ఉదయం ఉరి శిక్ష అమలు చేయడంతో సమస్య ముగిసిపోలేదు. ఇలాంటి ఎన్నో కేసులు కోర్టుల్లో నానుతున్నాయి. నిర్భయ కేసులో ప్రజల్లో వచ్చిన తీవ్ర ప్రతిస్పందన కారణంగా దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. అలాగే హైదరాబాద్ శివారులో వైద్యారాలు దిశ అత్యాచారం..పాశివక హత్య కేసులో కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం అయ్యింది. ప్రజల్లో తీవ్ర నిరసనలు పెల్లుబికాయి. ఇక విజయవాడలో ఆయేషా మీర అత్యాచారం,హత్య కేసులో ఆమె తల్లి ఇంకా పోరాడుతూనే ఉన్నారు. అయినా ఆమెకు న్యాయం దక్కలేదు. నటి ప్రత్యూషను కూడా అత్యచారం చేసి దారుణంగా హత్య చేసిన దోషులు దర్జాగా తిరుగుతున్నారు. ఇవన్నీ మన వైఫల్యాలకు అద్దం పడుతున్నాయి. ఏదైనా ఘటన జరిగిన వెంటనే సత్వర న్యాయం జరిగివుంటే ఇంత చర్చ జరిగి ఉండేది కాదు. చట్టాలను పటిష్టం చేసి, దోషులకు సత్వర శిక్షలు పడాలని ప్రజలంతా కోరుకుంటున్నా నాయకుల్లో మార్పులు రావడం లేదు. చట్టాలకు పదను పెట్టడం లేదు. అందుకే ఎలాంటి నేరమైనా దోషులు దర్జాగా ఉంటున్నారు. సరదా చేసుకుంటున్నారు. అత్యచారం చేసి, హత్య చేసినా తమకు ఢోకా లేదన్న భావనలో ఉంటున్నారు. అలాంటి వారందరికి తక్షణమే ఉరి శిక్ష అమలు చేయడం జరిగితే సమాజాంలో నేరాలను అదుపు చేయవచ్చు. ఇకనిర్భయ కేసులో వివరాల్లోకి వెళితే...2012 డిసెంబర్ నెలలో నిర్భయపై ఢిల్లీలో ఆరుగురు వ్యక్తులు అతి దారుణంగా అత్యాచారం చేశారు. ఓ పారా మెడికల్ విద్యార్థిని కదులుతున్న బస్సులో అత్యంత కిరాతకంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకు నిర్భయ మరణించింది. అప్పట్లో ఈ కేసు సంచలనం సృష్టించింది. ఆరుగురు నిందితులను పోలీసులు ఆధారాలతో సహా పట్టుకున్నారు. ఇందులో ఒకరు మైనర్ కావడంతో మూడేళ్ళ జైలు శిక్ష విధించారు. దాదాపు ఎనిమిది సంవత్సరాలుగా ఎన్నో మలుపులు? ఎన్నో చర్చల తర్వాత వీరికి ఎట్టకేలకు ఉరి శిక్ష అమలు చేశారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులు శిక్ష అనుభవించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న బస్సు డ్రైవర్ రామ్ సింగ్ 2013లో జైలులో ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. నిర్భయ దోషులకు ఉరిశిక్ష విధిస్తు కోర్టు తీర్పు ఇచ్చినా చివరి నిముషం వరకు ఉరితీయలేదు. గతంలో రెండుసార్లు డెత్ వారెంట్ రిలీజ్ చేసినా, చట్టం లోని లొసుగులు వినియోగించుకొని తప్పించుకునే ప్రయత్నం చేశారు. చట్టప్రకారం అన్ని అవకాశాలు వినియోగించుకున్నా మూడోసారి కూడా తప్పించుకోవాలని చూశారు. కోర్టు కఠినంగా వ్యవహరించి పాటియాలా కోర్టు ఇచ్చిన డెత్ వారెంట్‌ను అమలు చేయాలనీ తీర్పునిచ్చింది. దీంతో దోషులుగా తేలిన ముఖేశ్ సింగ్, పవన్ గుప్తా, అక్షయ్ ఠాకూర్, వినయ్ శర్మలను తీహార్ జైలులో శుక్రవారం తెల్లవారు జామున 5గంటల 30నిమిషాలకు ఉరి తీశారు. జైలు అధికారుల సమక్షంలో మీరట్ నుంచి వచ్చిన తలారి పవన్.. మనీలా తాళ్లతో ఉరి తీశారు. దక్షిణాసియ లోనే అతి పెద్దదైన తీహార్ కేంద్ర కారాగారంలో మూడవ నంబర్ గదిలో నలుగురిని ఒకేసారి ఉరి తీయడంతో నిర్భయ దోషులకు బతికే అవకావం లేకుండా చేశారు.

ఉరి తాడు నుంచి తప్పించుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో శుక్రవారం ఉదయం నిర్భయ దోషులు నలుగురికీ మరణదండన అమలు కావడం ఖాయమైంది. మన దేశంలో న్యాయ పక్రియ ఎంత సుదీర్ఘమైనదో, ఉరిశిక్ష పడినవారికి సైతం చట్టపరంగా ఎన్ని రకాల అవకాశాలుంటాయో ఈ కేసు మరోసారి నిరూపించింది. తమ కుమార్తెను అమానుషమైన చిత్రహింసలకు గురిచేసి, అత్యాచారం జరిపి హతమార్చిన దుండగులకు శిక్ష విధించడంలో ఎంతో జాప్యం చోటుచేసుకుందనుకుంటే... అది అమలు చేయడంలోనూ ఇంత తాత్సారమేమిటని నిర్భయ తల్లి అనేకసార్లు కన్నీరుమున్నీరయ్యారు. వారందరూ ఉరికంబం ఎక్కినరోజునే తమ కుమార్తె ఆత్మ శాంతిస్తుందని ఆమె చెప్పారు. అయితే ఉరిశిక్ష పడిన నేరస్తులకు అన్ని రకాల అవకాశాలూ ముగిశాకనే శిక్ష విధించడం మనకున్న చట్టాల ప్రకారం తప్పనిసరి కావడంతో శిక్ష అమలులో సుదీర్ఘ సమయం పట్టింది. వందమంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదు గానీ... ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడరాదన్నదే ఈ న్యాయ సిద్ధాంతంలోని అంతరార్థం. ఒకసారి ఉరిశిక్ష అమలయ్యాక దోషులుగా తేలినవారు ఏ కారణం చేతనో నిర్దోషులని తేలినా... వారి అభ్యర్థనల్ని పరిశీలించడంలో సాంకేతిక లోపాలు చోటుచేసుకున్నాయని తేలినా తప్పు సరిదిద్దుకోవడం అసాధ్యం కనుకనే ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నారని అర్థం చేసుకోవాలి. ఈ కేసుతో అయినా ఇక దోషులకు కఠిన శిక్షలు అమలయ్యేలా భారత శిక్షాస్మృతిని బలోపతేం చేసుకోవాల్సి ఉంది.

తీహార్ జైలు ముందు సంబరాలు

దోషులకు ఉరి అమలుతో నిర్భయ కుటుంబంలో ఆనందం

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): నిర్భయదోషులకు ఉరిశిక్ష అమలు కావడంతో దేశవ్యాప్తంగా హర్షతిరేకాలు వ్యక్తం కాగా..నిర్భయ కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు ఉదయమే తిహార్ జైలు దగ్గర సంబరాలు చేసుకున్నారు. ఇక మీరట్ నుంచి వచ్చిన ప్రత్యేక తలారి వీరు నలుగురికి ఉరి శిక్ష అమలు చేశారు. ఉరి అనంతరం దోషులను పరీక్షించిన వైద్యులు వారు మృతి చెందినట్లు తేల్చారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలు దీడీయూ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. అయితే నిర్భయ దోషులకు ఉరి తీసే ముందు.. వారి కుటుంబ సభ్యులను కలిసేందుకు ఐదు నుంచి పది నిమిషాలు అనుమతివ్వాలని వీరి తరఫున ముందు నుంచి వాదిస్తున్న న్యాయవాది ఏపి. సింగ్ కోరారు. అయితే దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ ఇందుకు నిబంధనలు అంగీకరించవని స్పష్టం చేశారు. ఇక సుప్రీం తీర్పు తర్వాత ఉరి శిక్ష పట్ల హర్షం నిర్భయ తల్లి ఆషాదేవి హర్షం వ్యక్తం చేశారు. దోషులకు ఉరిశిక్షతో తన కుమార్తె ఆత్మకు శాంతి చేకూరిందని ఆమె చెప్పారు. నిర్భయ తండ్రి సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. నిర్భయ దోషులకు ఉరిశిక్ష అమలు చేసిన తీహార్ జైలు వద్ద స్థానికులు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. నిర్భయ వర్ధిల్లాలి, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. కొందరు జాతీయ జెండా ప్రదర్శించారు. కాగా, నిర్భయ దోషులు ముఖేష్ సింగ్ (32), పవన్ గుప్తా (25), వినయ్ శర్మ (26), అక్షయ్ కుమార్ సింగ్ (31)ను ఉదయం 5:30 గంటలకు తీహార్ సెంట్రల్ జైలులోని జైలు నెంబర్ 3లో ఉరితీసిన సంగతి తెలిసిందే. ఇక జైలు వద్దకు చేరుకున్న వారిలో సామాజిక కార్యకర్త యోగితా భయానా కూడా ఉన్నారు. 'నిర్భయకు న్యాయం జరిగింది. మిగతా బాధితులకు కూడా న్యాయం జరగాలనే పోస్టర్‌ను ఆమె ప్రదర్శించారు. నిర్భయకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కష్టతరమైన యుద్ధంలో విజయం సాధించామని నిర్భయ కుంటుంబం సన్నిహితుడు అకాశ్ దీప్ అన్నారు. ఉరి శిక్ష నిర్ణయం, అమలు.. మంచిదే.. కానీ, శిక్ష అమలు ఇంతలా ఆలస్యం కాకుండా... ముందే జరగాల్సిందని దివ్యా ధావన్ అనే మహిళా అన్నారు. 'నిర్భయ దోషులకు ఉరి అమలుతో సమాజం ఏమీ మారదు. కానీ, నిర్భయకు న్యాయం జరిగింది. సంతోషం'అని సనా అనే యువతి తెలిపారు. ఇక దక్షిణాసియాలోనే అతిపెద్దదైన తీహార్ జైలులో ఒకేసారి నలుగురికి ఉరితీయయం ఇదే తొలిసారి. తీహార్ జైలు 16 వేల మంది ఖైదీలకు కాగారారం కల్పించే సామర్థ్యం కలిగి ఉంది. ఇక ఉరి అమలు నేపథ్యంలో జైలు వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

జస్టిస్ వర్మ చొరవతో అమల్లోకి నిర్భయ చట్టం

దోషులకు సకాలంలో శిక్షపడేలా యత్నం

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): పారామెడికల్ స్టూడెంట్ నిర్భయ అత్యాచారం తరవాతనే నిర్భయ చటట్ం అమల్లోకి వచ్చింది. నిర్భయ కేసు విచారణను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి ఆనాటి యూపీఏ ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయడంతోపాటు అత్యాచారం, ఇతర లైంగిక నేరాల్లో విధించాల్సిన శిక్షల గురించి, ఇతరత్రా తీసుకోవాల్సిన చర్యల గురించి సిఫార్సు చేయడానికి సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ వర్మ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల కమిటీ కూడా నియమించింది. జస్టిస్ వర్మ కమిటీ రికార్డు స్థాయిలో కేవలం 29 రోజుల్లోనే తన సిఫార్సులు అందించగా... ప్రభుత్వం కూడా చురుగ్గా కదిలి రెండు నెలల్లోనే అత్యాచార నేరానికి మరణ దండన విధించేలా నిర్భయ చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే నిర్భయ కేసు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో చాలా త్వరగానే పూర్తయిందని చెప్పాలి. 2012 డిసెంబర్ 16న నిర్భయ ఉదంతం జరగ్గా, నలుగురు దోషులకు 2013 సెప్టెంబర్‌లో మరణశిక్ష విధించింది. ఈ విచారణ కొనసాగుతుండగానే దుండగుల్లో ఒకడు ఆత్మహత్య చేసుకోగా, మరో దుండగుడి వయస్సు 16 ఏళ్లలోపు కావడం వల్ల అతడిపై జువెనైల్ కోర్టులో విచారణ జరిగి మూడేళ్ల శిక్ష పడింది. నలుగురు దోషులకూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విధించిన ఉరిశిక్షను ఆ మరుసటి ఏడాది మార్చిలో ఢిల్లీ హైకోర్టు ధ్రువీకరించింది. నిందితులు అప్పీల్ చేసుకోగా 2017 మే నెలలో ఈ నేరగాళ్లకు ఉరిశిక్ష సరైందేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అప్పటినుంచి రివ్యూ పిటిషన్లు మొదలయ్యాయి. నేరగాళ్లలో ఒకరి తర్వాత ఒకరు... ఆ తర్వాత వారి కుటుంబసభ్యులు పిటిషన్లు దాఖలు చేయడం, వాటిని తిరస్కరించడం, రాష్ట్రపతికి క్షమాభిక్ష వినతులు, వాటిని తోసిపుచ్చాక దాన్ని సవాలు చేస్తూ తిరిగి ఢిల్లీ హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ పిటిషన్లు దాఖలు చేయడం కొనసాగాయి. నేరం జరిగిన సమయానికి తాను జువెనైల్‌నని నేరగాడు పవన్ కుమార్ గుప్తా కింది కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తమను ఏకాంతవాస ఖైదు చేశారని, చిత్రహింసలకు గురిచేశారని, తమను ఉరి తీయాలంటూ కేంద్రమంత్రులు తదితరులు ప్రకటనలివ్వడం వల్ల ఆ ప్రభావం న్యాయస్థానాలపై పడిందని నేరగాళ్లు ఆరోపించారు. ఒక దోషి భార్య తాను వితంతువుగా బతకలేను గనుక అతగాడినుంచి విడాకులు ఇప్పించాలని కోరింది. ఈ సాకుతో శిక్ష అమలును జాప్యం చేయొచ్చునన్నది వారి ఎత్తుగడ. ఈలోగా ఉరిశిక్ష అమలుకు డెత్ వారెంట్లు జారీ కావడం, అవి వాయిదా పడటం రివాజైంది. ఇందిరాగాంధీ హత్య కేసు, పార్లమెంటు దాడి కేసు, ముంబైపై ఉగ్రవాద దాడిలో పట్టుబడిన కసబ్ విషయంలోనూ ఉరిశిక్ష విధించడానికీ, దాన్ని అమలు చేయడానికీ మధ్య ఎంతో కాలం పట్టింది. ఈ క్రమంలో బాధిత కుటుంబాలకు ఆవేదన ఉంటుందన్నది నిజమే. తమవారికి ఏం జరిగిందో, దోషులకు కూడా తక్షణం అదే జరగాలని వారు పట్టుదలగా వుంటారు. నిర్భయ దోషుల విషయానికే వస్తే వారు అనుసరించిన విధానాలు, శిక్ష తప్పించుకునేందుకు వారు చూపిన సాకులు నిర్భయ కుటుంబీకులకు మాత్రమే కాదు... దేశ ప్రజలందరికీ ఆగ్రహం కలిగించాయి. ఇలా ఇంకెన్నాళ్లు కాలక్షేపం చేస్తారన్న ప్రశ్నలు తలెత్తాయి. ఈ కేసులో నేరగాళ్ల దుర్మార్గం సమాజం మొత్తాన్ని కలచివేసింది. కనుకనే ఈ ఉదంతంపై అంతగా ఆగ్రహావేశాలు పెల్లుబికాయి.

కరోనాపై కేంద్రం మరింత అప్రమత్తం

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య
పంజాబ్‌లో మరో వ్యక్తి మృతితో అలర్ట్
పలుమార్గదర్శకాలు విడుదల
నేటినుంచి అంతర్జాతీయ విమానాల నిషేధం
ఉద్యోగులకు ఇంటినుంచి పనిచేసే వెసలుబాటు
65 ఏళ్లు పైబడ్డ వారు ఇంటి నుంచి రాకుండా ఆంక్షలు
పిల్లలను బయటకు పంపొద్దని ఆదేశాలు
వదంతులు నమ్మొద్దని ప్రధాని మోడీ సూచన

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): కరోనాపై కేంద్రప్రభుత్వం కార్‌ఆచరణకు దిగింది. కరోనా బాధితులు పెరగడంతో పాటు, తాజాగా పంజాబ్‌లో మరొకరు మరణించడంతో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అలాగే కరోనా మహమ్మరి భారత్‌లో మరోకరిని బలితీసుకుంది. పంజాబ్‌లో కరోనా వైరస్ సోకిన 72 ఏళ్ల వృద్ధుడు గురువారం మృతిచెందాడు. దీంతో భారత్‌లో కరోనా మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇటీవలే అతను జర్మనీ నుంచి ఇటలీ మీదుగా భారత్‌కు వచ్చినట్టుగా తెలుస్తోంది. ఇప్పటివరకు కర్ణాటక, ఢిల్లీ, మహారాష్ట్రలలో కరోనా మరణాలు నమోదయ్యాయి. తాజా సమాచారం ప్రకారం దేశంలో కరోనా సోకినవారి సంఖ్య 167కు చేరింది. ఈ నేపథ్యంలో కరోనా వ్యాప్తి నిరోధానికి కేంద్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇకపోతే కరోనావైరస్ దేశంలో వేగంగా వ్యాపిస్తుండటంతో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పలు జాగ్రత్తలు జారీ చేసింది. ముందస్తు జాగ్రత్త చర్యలను సైతం కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. అంతేకాదు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కరోనావైరస్ నివారణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాయి. ఇక కరోనా వైరస్‌కు సంబంధించి పలు వదంతులు వస్తున్న నేపథ్యంలో ఆయా రాష్ట్ర పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కరోనావైరస్‌కు సంబంధించి వదంతులను నమ్మొద్దని ఎవరూ తప్పుడు సమాచారంను ప్రచారం చేయొద్దంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికే దేశప్రజలను కోరారు. సోషల్ మీడియాలో కరోనావైరస్ పై వస్తున్న వదంతులను నమ్మరాదని ప్రధాని కోరారు. ఇక ఇప్పటికే పలు రాష్ట్రాల్లో షాపింగ్ మాల్స్, థియేటర్లు, స్కూళ్లను మూసివేయడం జరిగింది.

దేశవ్యాప్తంగా అంతర్జాతీయ విమాన సర్వీసులను కేంద్రం రద్దు చేసింది. ఈ నెల 22 నుంచి వారంపాటు 29వ తేదీ వరకు అంతర్జాతీయ విమానాలకు దేశీయంగా అనుమతిని నిలిపివేసింది. మరోవైపు శుక్రవారం అన్ని రాష్ట్రాల సిఎంలతో ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వార చర్చించ నున్నారు. కరోనా విషయంలో కేంద్ర ఆరోగ్యశాఖ రాష్ట్రాలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. 65 ఏళు పైబడిన వారు ఇళ్లకే పరిమితం కావాలని సూచించింది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, వైద్య సిబ్బందికి మినహాయింపు ఇచ్చింది. పదేళ్లలోపు పిల్లలను ఇంటి నుంచి బయటికి రానివ్వొద్దని సూచించింది.

ప్రభుత్వ, ప్రైవేటురంగంలోని ఉద్యోగులకు ఇంటినుంచే పనిచేసే వసతి కల్పించాలని సూచించింది. అత్యవసర, తప్పనిసరి విభాగాల ఉద్యోగులకు మినహాయింపు ఉంటుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ గ్రూప్ బీ, సీ కేటగిరీల ఉద్యోగులు వారం విడిచి వారం విధులకు రావాలని పేర్కొంది. ప్రభుత్వం చేసిన అన్ని సూచనలు రాష్ట్రాలు, ప్రజలు తప్పనిసరిగా పాటించాలంది. థియేటర్లు, పార్కులు, మ్యూజియంలు మూసివేయాలంది. ప్రజలు ఎక్కువమంది ఒకచోటకు చేరకుండా దూరం పాటించాలని సూచించింది.

కరోనా వైరస్ కేసుల సంఖ్య రోజురోజుకు అధికమవుతున్న నేపథ్యంలో కరోనా నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల విధుల వేళల్లో కీలక నిర్ణయం తీసుకున్నది. గ్రూప్ బి, గ్రూప్ సి వర్గాల ఉద్యోగుల్లో సగం మంది కార్యాలయాలకు వచ్చి పని చేయాలని సూచించింది. ఇక ఇదే వర్గంలోని మిగతా 50 శాతం మంది ఉద్యోగులు ఇంటి నుంచే పని చేయనున్నారు.

అయితే ఉద్యోగులను మూడు విభాగాలుగా విభజించి, నిర్ణీత సమయాల్లో వచ్చి వెళ్లేలా నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు వారం విడిచి వారం విధులకు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించాలని హెచ్‌వోడీలకు కేంద్రం సూచన చేసింది. ఈ పని వేళలు మార్చి 20వ తేదీ నుంచే వర్తించనున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ పని వేళలు కొనసాగనున్నాయి. కార్యాలయాలకు వచ్చి పని చేసే ఉద్యోగులకు మూడు రకాల స్లాట్స్‌ను కేటాయించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు, ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు విధులు నిర్వహించనున్నారు. ఇక ఇంటి నుంచి పని చేసే ఉద్యోగులు కచ్చితంగా టెలిఫోన్‌లో లేదా ఇతర మాధ్యమాల్లో అందుబాటులో ఉండాలని కేంద్రం ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో కార్యాలయానికి వచ్చేలా సిద్ధంగా ఉండాలని పేర్కొంది. వయసు పైబడిన ఉద్యోగులు, ఇప్పటికే మెడికల్ కండిషన్స్‌లో ఉన్న ఉద్యోగులు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం సూచించింది.

విదేశాల నుంచి వచ్చిన వారు తక్షణం రిపోర్ట్ చేయాలి

గ్రామాల వారిగా విదేశాల నుంచి వచ్చిన వారి వివరాల సేకరణ
యధావిధిగా టెన్త్ పరీక్షల నిర్వహణ
పరీక్షా కేంద్రాల్లో శానిటైజేషన్
వైరస్ వ్యాప్తి అంతా విదేశాల నుంచి వచ్చిన వారి వల్లనే
తెలంగాణ సరిహద్దుల్లో 18 చెక్ పోస్టుల ఏర్పాటు
కరోనా తీవ్రత తెలంగాణలో అంతగా లేదు
ప్రార్థనా మందిరాల్లో భక్తుల రాకపై నిషేధం
ఫంక్షన్లపైనా ఆంక్షల కొనసాగింపు
విదేశీ విమానాలపై ఆంక్షలు విధించి వుంటే సమస్య వచ్చేది కాదు
ప్రధాని దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళతా
కరోనాకు ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష
ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం మీడియాతో సిఎం కెసిఆర్

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): తెలంగాణకు వివిధ దేశాల నుంచి వచ్చి, వివరాలు ఇవ్వని వారి వివరాలు తక్షణమే సేకరించాలని సిఎం కెసిఆర్ ఆదేశించారు. పోలీస్, ఇంటిలిజెన్స్ సహా సర్పంచ్‌ల స్థాయిలో విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలు సేకరించి వారిని,క్వారెంటెన్‌లో ఉంచుతామని అన్నారు. రామగుండం ఘటన నేపథ్యంలో తక్షణం ఈ చర్యలకు ఆదేశించామన్నారు. తెలంగాణలో ప్రమాదకర పరిస్థితులు లేవన్నారు. ఇప్పటి వరకు నమోదైన కేసులన్నీ విదేశాల నుంచి వచ్చిన వారివల్లనే అన్నారు. కరోనాపై ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష చేసిన అనంతరం సిఎం కెసిఆర్ మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. కరోనా నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో మంత్రులు, ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... అధిక సంఖ్యలో ప్రజలు గుమిగూడకుండా ఉండడమే కరోనా వైరస్‌కు సరైన విరుగుడు అని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు సూచించారు. ముస్లింలు నిర్వహించే జగ్‌నేకే రాత్‌ను రద్దు చేశామని, అలాగే ఉగాది రోజు నిర్వహించే పంచాంగ శ్రవణాన్ని నిర్వహించమని అన్నారు. శ్రీరామ నవమి ఉత్సవాలను కూడా రద్దు చేసినట్లు ఆయన ప్రకటించారు. బస్సులు, క్యాబ్‌లు, టాక్సీల్లో సానిటేషన్ ఎక్కువగా చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో సానిటేషన్ ఎక్కువ మొత్త ంలో చేయాలని, అది శుక్రవారం నుంచే ప్రారంభమవుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రార్థనాలయాలకు భక్తుల రాకను నిషేధిం చామన్నారు. ఇది అన్ని మతాలకు వ ర్తిస్తుందన్నారు. టెన్త్ పరీక్షలు జరుగుతు న్నందున అన్ని కేంద్రాల్లో శానిటైజేషన్ చేయాలని ఆదేశించామన్నారు. పరీక్షలు యధావిధిగా జరుగుతాయన్నారు. కరోనా వైరస్ విషయంలో కరీంనగర్‌లో జరిగిన ఉదంతం దృష్ట్యా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో చర్చించాం. ఎలా ముందుకు పోవాలో అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు తెలంగాణలో 14 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో ఐదుగురు మాత్రమే విదేశాల నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో దిగారు. మిగిలిన వారు ఇతర ఎయిర్‌పో ర్టుల్లో దిగి బస్సులు, రైళ్లలో రాష్ట్రాలకు వచ్చారు. వేరే ఎయిర్‌పోర్టుల్లో దిగి రాష్ట్రానికి వచ్చిన వారిని గుర్తించడం కష్టం. ఇండోనేషియా నుంచి వచ్చిన వారు కూడా రోడ్డు, మార్గాల ద్వారా వచ్చిన వారే. వియత్నాం చైనా పక్కనే ఉంటుంది. అయినా ఆదేశానికి ఇబ్బంది లేదు. ఏ దేశంలో చర్యలు తీసుకోలేదో అక్కడ ఇబ్బంది ఉందన్నారు. వియత్నాం తీసుకున్న చర్యల వల్ల అక్కడ వ్యాధి వ్యాప్తి జరగలేదన్నారు. నిజానికి ఇప్పటికే అంతర్జాతీయ విమానా లపై ఆంక్షలు విధించి వుంటే ఈ విపత్తు వచ్చేది కాదన్నారు. ఇదే విషాయన్ని ప్రధా నికి కూడా సూచిస్తామన్నారు. చైనా ఇటలీ నిర్లక్ష్యం చేశాయి కాబట్టే ఇబ్బంది పడ్డాయి. మార్చి 1 తరువాత విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించాలని ఆదేశాలు ఇచ్చాం. మార్చి 1 తర్వాత విదేశాల నుంచి వచ్చిన వారు ఎవరికి వారు రిపోర్టు చేయాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ సిబ్బంది, ఇంటెలిజెన్స్ సిబ్బంది విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలు సేకరిస్తున్నాం. వారం పాటు మూసివేయాలని ఆదేశించిన వాటి గడువు మార్చి 31 వరకు పొడగిస్తున్నాం. దేవాలయాలు, మసీదులు, చర్చీలకు ప్రజలు అనుమతించవద్దు. మంది గుమికూడకుండా ఉండటమే కరోనా కట్టడికి ముఖ్య సూత్రం అన్నారు. మాల్స్, పంక్షన్ హాళ్లు, సినిమా హాళ్లపై నిషేధం కొనసాగుతుందన్నారు. ఇకపోతే అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో 18 చెక్ పోస్టులు పెట్టి రాకపోకలను గమనిస్తామని అన్నారు. ఇకపోతే సూపర్ మార్కెట్లు, దుకాణాలు యధావిధిగా తెరిచే ఉంటాయన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించిన మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి దివ్య కూడా ఉన్నారు.

గిరిజన బాలికకు కవిత అండ

కంటిచూపు మందగించడంతో వైద్యసాయం

నిజామాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): ఆరోగ్య సమస్యలతో కంటిచూపు మందగించిన గిరిజన బాలికకు మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు. ఆమె భరోసాతో కోలుకున్న నందిని టెన్త్ పరీక్షలు రాసేందుకు వెళ్లారు. వివరాల్లోకి వెళితే...ఆర్మూరు నియోజకవర్గం మాక్లూరుకు చెందిన నందిని చదువులో టాపర్. మాక్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చదువులో ముందుండంతో పాటు మంచి పెయింటర్. అయితే షుగర్, థైరాయిడ్‌తో బాధపడుతున్న నందినికి కంటిచూపు క్రమంగా మందగిచింది. నిత్యం ఇన్సులిన్ ఇంజక్షన్‌తో కాలం వెళ్లదీస్తుంది. తండ్రి చిన్నప్పుడే మరణిచండం, తల్లి మానసిక వ్యాధితో మంచం పట్టడం ఇటు తనకు వ్యాధి తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విషయం తెలుసుకున్న కవిత బాలికకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నందినికి మెరుగైన చికిత్స అందించేందుకు సిద్ధమయ్యారు. బాలికను హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయించారు. కంటి చికిత్స పూర్తవడంతో నందిని ఆరోగ్యం కుదుటపడింది. పదో తరగతి పరీక్షలు రాసేందుకు వెళ్తున్న నందిని గురువారం కవితను కలిశారు. నందినికి ఎప్పుడు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తనకు సమాచారం అందించాలని ఉపాధ్యాయులు, బాలిక బంధువులకు సూచించింది. పరీక్షలు రాసేందుకు వెళ్తున్న బాలికకు అభినందనలు తెలిపి ఉత్సాహాన్ని నింపారు. నందిని బొమ్మలు గీసే నైపుణ్యాన్ని మెచ్చుకున్నారు.

జార్జియాలో చిక్కుకున్న తెలంగాణ విద్యార్థి

మెదడులో రక్తం గడ్డకట్టడంతో ప్రాణాపాయం

స్వదేశానికి అనుమతించని అధికారులు

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను వణికిస్తోందిప్పుడు. వ్యాధి నిరోధానికి, వైరస్ వ్యాప్తికి ఆయా దేశాలు ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టాయి. ఈ నేపథ్యంలో విమానయాన ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలను విధిస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ నుంచి విదేశాలకు వెళ్లిన విద్యార్థులు తిరిగి వచ్చేందుకు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ప్రయాణ సౌకర్యాలు లేక అల్లాడిపోతున్నారు. ఎవరైన అస్వస్థకు గురైతే వారి కుటుంబ సభ్యుల వేదన వర్ణనాతీతం. ఇటువంటి ఘటనే తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ విద్యార్థిని విషయంలో జరిగింది. భువనగిరికి చెందిన శివాణి అనే విద్యార్థిని వైద్య విద్య అభ్యసించేందుకు జార్జియా వెళ్లింది. కాగా రెండు రోజులక్రితం కాలేజీకి వెళుతున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురైంది. వైద్యులు పరీక్షలు చేసి మెదడులో రక్తం గడ్డకట్టుకుపోయిందని తెలిపారు. వెంటనే చికిత్స చేయాల్సిందిగా సూచించారు. ఈ విషయాన్ని తోటి విద్యార్థులు బాధితురాలి తల్లిదండ్రులకు తెలియజేశారు. హైదరాబాద్‌లో చికిత్స చేయించేందుకు ఏర్పాట్లు చేసుకుని తమ బిడ్డను తిరిగి పంపించాల్సిందిగా కోరారు. కానీ శివాణిని భారత్‌కు తరలించేందుకు జార్జియా అధికారులు నిరాకరించారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తీవ్ర ఆంక్షలు అమలు చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తమ బిడ్డ చికిత్స అందకపోతే బ్రతకలేదని కావునా తిరిగి భారత్‌కు రప్పించాల్సిందిగా తల్లిదండ్రులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు.

కేంద్ర ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కరోనా వైరస్ విళయ తాండవం చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రూప్ బి, గ్రూప్ సి వర్గాల ఉద్యోగుల్లో సగం మంది ఇంటి నుంచే విధులు నిర్వర్తించాలని సూచించింది. ఇదే వర్గంలోని మిగితా 50 శాతం మంది ఉద్యోగులను మూడు భాగాలుగా విభజించి, నిర్ణీత సమయాల్లో వచ్చి వెళ్లేలా నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా వారం విడిచి వారం విధులకు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అన్ని విభాగాల అధిపతులకు కేంద్రం సూచించింది. ఈ పనివేళలు శుక్రవారం నుంచే వర్తిస్తాయని, ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పనివేళలే కొనసాగుతాయని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

ధైర్యంగా ఎదుర్కోవాల్సిన సమయం

అభిమానులకు వీడియో సందేశంలో చిరంజీవి

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): ప్రాణాంతక మహమ్మారి కరోనా వైరస్ ప్రపంచ దేశాలను వణికిస్తోంది. దీని నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ ప్రముఖులు, సెలబ్రెటీలు ప్రజలకు సూచనలు ఇస్తున్నారు. బాలీవుడ్ నుంచి కోలివుడ్ వరకూ ప్రముఖ నటి నటులంతా తమ అభిమానులకు తగిన సలహాలు సూచనలు ఇస్తున్నారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి కరోనా వైరస్ నుంచి అప్రమత్తంగా ఉండాలంటూ తన అభిమానులకు గురువారం వీడియో ద్వారా సందేశం ఇచ్చారు. కరోనా ప్రాణాంతకం కాకపోవచ్చు కానీ నిర్లక్ష్యం చేస్తే మహమ్మారిగా మారే ప్రమాదం ఉందని చిరంజీవి హెచ్చరించారు.

ఈ వీడియోలో ఆయన మాట్లాడుతూ.. 'అందరికీ నమస్కారం.. యావత్ ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్న సమస్య కరోనా వైరస్. అయితే దీని వల్ల మనకేదో అయిపోతుందన్న భయం కానీ.. మనకేం కాదనే నిర్లక్ష్యం కానీ రెండు పనికి రావు. దీని నుంచి జాగ్రత్తగా ఉంటూ ధైర్యంగా ఎదుర్కొవాల్సిన సమయం ఇది. ఈ ఉధృతం తగ్గే వరకూ జనసముహానికి దూరంగా ఉండండి' అని సూచించారు. అంతేగాక ఇంట్లో ఉండి వ్యక్తిగతం కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో మోచేతి వరకూ వీలైనన్ని సార్లు సబ్బుతో లేదా హ్యాండ్ వాష్‌లతో కనీసం 20 సెకన్ల పాటు చేతులు కడుక్కోవాలని సూచించారు. తుమ్మినా, దగ్గినా కర్చీఫ్ కానీ టిష్యూ పేపర్‌ను అడ్డు పెట్టుకోవడం తప్పనిసరి. ఒక్కసారి వాడిన టిష్యూ పేపర్‌ను మరోసారి వాడకుండా.. మూత ఉన్న చెత్త బుట్టలో వేయడం శ్రేయస్కరం. మీ చేతులను కళ్లకు, ముక్కుకు, నోటికి తగలకుండ జాగ్రత్త వహించండి. బయటకు వెళ్లినప్పుడు మీ దగ్గు, జలుబు ఇతరులకు సోకకుండా ముఖానికి మాస్క్‌లు ధరించండి. ఒకవేళ అలసట, నీరసం జ్వరం ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చేసే బాధ్యత మనందరి మీద ఉంది. అలాగే ఎవరికీ షేక్ హ్యాండ్ ఇవ్వకుండా మన సాంప్రదాయం ప్రకారం నమస్కారం చెబుదాం అంటూ చెప్పుకొచ్చారు.

ఇండోనేషియా నుంచి వచ్చిన వారి గుట్టు కనిపెట్టండి

-బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): ఇండోనేషియా నుంచి కరీంనగర్ వచ్చిన వారు ఏ పని మీద వచ్చారో ఆరా తీయాల్సి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. వారు ఎవరికి సమాచారం ఇవ్వకుండా రావడంపై అనుమానాలు ఉన్నాయని అన్నారు.

మత ప్రచారం కోసమే వచ్చారా..? వేరే ఏదైనా కారణం ఉందో తేల్చాలన్నారు. వారు ఎక్కడెక్కడ తిరిగారో తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎయిర్ పోర్టులో పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. రోడ్డు మార్గంలో చాలామంది విదేశీయులు రాష్ట్రానికి వస్తూనే ఉన్నారని అన్నారు. ఇండోనేషియా నుంచి కరీంనగర్ వచ్చిన వారిలో ఏడుగురికి కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 13కు చేరింది. కావ ఉన ఇండోనేషియా నుంచి వారికి ఎవరెవరు ఆశ్రయమిచ్చారో గుర్తించాలన్నారు. వారుమతప్రాచారానికి రావడంలో ఆంతర్యమేమిటో కూడా ఆరా తీయాలన్నారు. అంతేనా లేక ఇక్కడ ఏదైనా కుట్రలు చేసేందుకు వచ్చారా అన్నది కూడా గమనించాలన్నారు.

కరోనా కట్టడికి పంజాబ్ కఠిన చర్యలు

ప్రజారవాణాపై నేటి నుంచి నిషేధం

చండీగఢ్,మార్చి20(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తిని నివారించేందుకు పంజాబ్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ప్రజారవాణాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మార్చి 20 శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఈ నిలిపివేత అమలులోకి వస్తుందని పేర్కొంది. కరోనా నేపథ్యంలో ప్రజారవాణాను నిలిపివేయనున్న తొలి రాష్ట్రం పంజాబ్ కావడం విశేషం.

శుక్రవారం నుంచి బస్సులు, ఆటోలతో పాటు ఏ ఇతర ప్యాసింజర్ వాహనాలు రోడ్లపై తిరిగేందుకు వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం మంత్రివర్గం సమావేశమై చర్చింది. ఈక్రమంలో ప్రజారవాణాను నిలిపివేసేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు ప్రభుత్వం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. శుభకార్యాలైతే 50 మంది, ఇతర సమావేశాలైతే 20 మంది కంటే ఎక్కువ గుంపులుగా ఉండరాదని చెప్పింది. ఇదిలా ఉండగా.. భారత రైల్వే సైతం విడతల వారీగా రైళ్ల రద్దుకు పూనుకుంది.

రైల్వే సర్వీసులకు బ్రేక్

రాయితీల పాస్‌లపై ఆంక్షలు

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కోవిడ్-19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రైల్వేశాఖ అన్ని రకాల టికెట్లపై రాయితీలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అత్యవసర ప్రయాణికులు తప్ప ఇతరులు ప్రయాణం చేయకూడదని అధికారులు విజ్ఞప్తి చేశారు. యూటీఎస్, పీఆర్ఎస్ టికెట్లపై పూర్తి రాయితీని తొలగిస్తున్నట్లు తెలిపింది. పరీక్షలకు హాజరయ్యే, స్వస్థలాలకు వెళుతున్న విద్యార్థులకు, నాలుగు రకాల దివ్యాంగులకు, 11 రకాల పేషంట్లకు తప్ప మిగితా అందరికీ రాయితీ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20నుంచి బుక్ చేసుకునే వారికి ఈ నిబంధనలు అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇకపోతే పలు ప్రాంతాలకుకూడా రైల్వే సర్వీసులు నిలిపివేశారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ముగిసిన నామినేషన్ల గడువు

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నామినేషన్ల గడువు గురువారంతో ముగిసింది. ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 13 నామినేషన్ సెట్లు దాఖలయ్యాయి. ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. అధికార టీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత నాలుగు సెట్ల నామినేషన్లు సమర్పించారు. బీజేపీ అభ్యర్థి లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ అభ్యర్థి సుభాష్‌రెడ్డి తలో రెండు సెట్ల నామినేషన్లు వేశారు. శ్రమజీవి పార్టీ నుంచి భాస్కర్, స్వతంత్ర అభ్యర్థిగా శ్రీనివాస్ ఒక సెట్ నామినేషన్ వేశారు. ఈ నెల 20న నామినేషన్ల పరిశీలన జరగనుంది. 23న నామినేషన్ల ఉపసంహరణకు గడువు. ఏప్రిల్ 7వ తేదీన పోలింగ్ నిర్వహణ జరగనుంది.

తెలంగాణలో పలుప్రాంతాలో వడగళ్ల వాన

దెబ్బతిన్న పంటలు..భారీగా నష్టం

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కురిసింది. ఉపరితల ఆవర్తనంతో భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్, కుమ్రం భీమ్, నల్లగొండ, హైదరాబాద్‌లో వర్షం దంచికొట్టింది. పలు చోట్ల వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. దీంతో మామిడి, వ రిపొలాలు దెబ్బతిన్నాయి. నగరంలోని ఫిలీంనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కిష్మత్‌పుర, రాజేంద్రనగర్, అత్తాపూర్, ఎల్బీనగర్, హయత్‌నగర్, ఉప్పుగూడలో వర్షం పడింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే ఉద్యోగులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మరోవైపు సంగారెడ్డి, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో కూడా వడగండ్ల వాన పడింది. పలుచోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షానికి వాహనదారులకు ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలు చోట్లు వర్షం కురిసింది. గాలి వానకు పలు చోట్ల చెట్లు నేలకూలాయి. ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. రంగారెడ్డి జిల్లాలో కూడా వర్షం పడింది. అనుకొని వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మేకలపై పిడుగుపాటు

విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలోని గురువారం కురిసిన భారీ వర్షానికి సరే వలస గ్రామ సమీపంలో మేత మేస్తున్న మేకలపై పిడుగు పడటంతో మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంలో సరే వలస గ్రామానికి తట్టబోను చెందిన సన్యాసి, తట్టబోను అప్పారావు దువ్వు కిట్ట , ఒడ్డు అప్పలస్వామిలకు చెందిన సుమారు రెండు లక్షల విలువైన 20 మేకలు మృతి చెందాయి. దీంతో కాపరులు అంతా లబోదిబోమంటున్నారు. తరతరాల నుంచి మేకలు పెంచుకునే బ్రతుకుతున్నామని, ప్రకృతి తమ బ్రతుకులు నాశనం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం



హైదరాబాద్,మార్చి 20 : రాష్ట్రంలో ఈ రోజు నుంచి ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను ప్రారంభమైనట్లు బోర్డు అధికారులు తెలిపారు. గత అనుభవం నేపథ్యంలో అన్ని స్పాట్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లుచేశామని చెప్పారు. వాల్యుయేషన్‌లో మూడంచెల విధానాన్ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ పూర్తిచేసి ఫలితాల విడుదలకు వీలుగా.. రోజూ రెండు పూటల వాల్యుయేషన్ కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలతోపాటు హైదరాబాద్, రంగారెడ్డిలో అదనంగా రెండు స్పాట్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

బహిరం

భారత్‌లో ఐదుకు చేరిన కరోనా మృతులు

జైపూర్‌లో ఇటలీ దేశస్తుడు మృతి
వ్యాధి నయం అయినా గుండెపోటుతో మృతి
195కు చేరిన కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య
పెట్టి విదేశీయుల రాకపై ఎక్కడికక్కడే నిఘా

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): మృత్యుఘంటికలు మోగిస్తున్న కరోనాతో భారత్‌లో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. శుక్రవారం ఉదయం రాజస్థాన్‌లో కరోనాతో ఇటలీ దేశస్తుడు మృతి చెందాడు. ఇటలీ దేశానికి చెందిన కొంతమంది టూరిస్టులు ఇటీవల రాజస్థాన్‌కు వచ్చారు. వచ్చిన 16 మంది టూరిస్టులకు కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో వారిని ఐసోలేషన్ వార్డుల్లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. జైపూర్‌లోని ఫొర్టిస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 69 ఏళ్ల వృద్ధుడు ఉదయం మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కరోనా బారిన పడి కోలుకున్న ఆ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించాం.భారత్‌లోని సందర్శనీయ ప్రదేశాలను వీక్షించడం కోసం ఇటలీ నుంచి వచ్చిన 69 ఏళ్ల పర్యాటకుడు కరోనా బారిన పడ్డాడు. భారత్‌లో తొలిగా వెలుగుచూసిన కరోనా పాజిటివ్ కేసుల్లో ఇది ఒకటి.కరోనా పాజిటివ్‌గా తేలిన ఈ ఇటలీ పర్యాటకుడికి జైపూర్‌లోని ఎస్ఎమ్ఎస్ హాస్పిటల్‌లో వైద్యులు చికిత్సనందించారు. హెచ్ఐవీ, మలేరియా, స్వైన్ ఫ్లూ వ్యాధులు సోకితే ఇచ్చే మెడిసిన్‌ను ఈ ఇటలీ పర్యాటకుడికి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో.. ఈ వ్యక్తి కరోనా నుంచి కోలుకున్నాడని, శుక్రవారం గుండెపోటుతో ఆయన మృతి చెందాడని వైద్యులు ప్రకటించారు. భారత్‌లో ఇప్పటివరకూ 195 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరిలో 32 మంది విదేశీయులే కావడం గమనార్హం. ఇందులో 163 మంది భారతీయులు కాగా, 32 మంది విదేశీయులు ఉన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు ఐదుగురు మృతి చెందారు. ఇక ఢిల్లీ, మహారాష్ట్ర, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్‌లో ఒక్కొక్కరి చొప్పున కరోనా వైరస్‌తో మృతి చెందారు.కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. 22న ఆదివారం జనతా కర్ఫ్యూను స్వచ్ఛందంగా పాటిద్దామని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇది ప్రపంచ యుద్దాల కంటే ప్రమాదమని మోదీ అన్నారు. ఈ వైరస్ పట్ల మనకేం పర్వాలేదన్న ఉదాసీనత వద్దు అని మోదీ సూచించారు. ఇక కేంద్ర వైద్యారోగ్య శాఖ ఎప్పటికప్పుడు రాష్ట్రాల్లో తీసుకుంటున్న చర్యలను తెలుసుకుంటుంది. విదేశాల నుంచి ప్రయాణికులపై నిఘా పెట్టింది. అన్ని ఎయిర్‌పోర్టుల్లో థర్మల్ స్క్రీనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. రైళ్లలోనూ ఈ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రయాణికులను పరీక్షిస్తున్నారు. దాదాపు అన్ని రాష్ట్రాలు ఈ నెల 31 వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాయి. రద్దీ ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటునారు. సినిమా హాల్స్, మాల్స్, పబ్బులు, క్లబ్బులను మూసివేశారు. కరోనా కేసులను రాష్ట్రాల వారిగా పరిశీలిస్తే.. అత్యధికంగా మహారాష్ట్రలో 47 కేసులు నమోదు అయ్యాయి. ఇందుల్లో ముగ్గురు విదేశీయులు ఉన్నారు. రెండో స్థానంలో కేరళ నిలిచింది. కేరళలో 28 కేసులు నమోదు కాగా, ఇద్దరు విదేశీయులు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ లో 19(ఒక విదేశీ వ్యక్తి), కర్ణాటకలో 15, ఢిల్లీలో 17 కేసులు నమోదు కాగా, ఒక విదేశీ వ్యక్తి ఉన్నాడు. లధక్ లో 10, తెలంగా ఓణలో రాష్ట్రానికి చెందిన వారు ఏడుగురు కాగా, విదేశీయులు తొమ్మిది మంది ఉన్నారు. జమ్మూకశ్మీర్ లో 4, రాజస్తాన్ లో 7 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఇందులో ఇద్దరు విదేశీయులు ఉన్నారు. తమిళనాడు, హర్యానాలో మూడు కేసుల చొప్పున, హర్యానా, పంజాబ్ లో రెండు కేసుల చొప్పున నమోదు అయ్యాయి. ఉత్తరాఖండ్, బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరికి మాత్రమే కరోనా పాజిటివ్ వచ్చింది.

నిర్భయ కేసు దర్యాప్తును ఛాలెంజ్‌గా తీసుకున్నాం

అన్ని సాక్ష్యాలను పక్కాగా సేకరించాం
దోషులను కోర్టుముందు పక్కా ఆధారాలతో నిలబెట్టాం
దర్యాప్తు అధికారి ఏసీపీ రాజేందర్ సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): నిర్భయ హత్యాచారం కేసులో దోషుల ఉరితీతపై ఈ కేసు దర్యాప్తు చేసిన పోలీసు అధికారుల్లో ఒకరైన ఏసీపీ రాజేందర్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఉరిశిక్ష అమలు ద్వారా నేరగాళ్లు తప్పించుకోలేరంటూ సమాజానికి గట్టి సందేశం ఇచ్చినట్లు అయ్యిందన్నారు. నిర్భయ కేసులో అక్షయ్ సింగ్ ఠాగూర్, పవన్ గుప్తా, వినయ్ శర్మ, ముఖేశ్ సింగ్ సహా మొత్తం నలుగురు నిందితులను ఉదయం 5:30 లకు తీహార్ జైల్లో ఉరితీసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాజేందర్ సింగ్ మాట్లాడుతూ.. దోషుల ఉరితీతతో నేరాలకు పాల్పడిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరంటూ సమాజానికి గట్టి సందేశం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రజల నుంచి ఒత్తిడి రాకముందే.. దీనిలోని తీవ్రతను గుర్తించి మేము విచారణ చేపట్టామని పేర్కొన్నారు. ఈ కేసులో చేసిన దర్యాప్తు క్రమాన్ని ఢిల్లీ పోలీస్ శిక్షణా కేంద్రాల్లో కూడా బోధిస్తున్నారని సింగ్ పేర్కొన్నారు. నిర్భయ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు ఆమె కుటుంబ సభ్యుల బాధ చూసి అధికారులు చలించిపోయారన్నారు. నిర్భయ చికిత్స పొందుతున్న ఆస్పత్రివద్ద ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడిన తర్వాత... మా అధికారులు బాధిత కుటుంబంలో ఒకరిలా మారిపోయారు. ఎమోషనల్‌గా ఏర్పడిన ఆ అనుబంధమే... ఈ కేసులో పటిష్టమైన దర్యాప్తు చేపట్టేందుకు ప్రేరేపించిందని సింగ్ గుర్తుచేసుకున్నారు. ఈ కేసుకున్న ప్రాధాన్యత దృష్ట్యా వెనువెంటనే సుమోటోగా తీసుకుని దర్యాప్తు చేపట్టి, సాక్షుల నుంచి వాంగ్మూలాలు సేకరించామన్నారు.

హుటాహుటిన ఓ దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి అదే రోజు రాత్రి విచారణ చేపట్టాం. తొలుత ఓ పోలీస్ స్టేషన్‌కి చెందిన బృందం దీనిపై విచారణ జరిపింది. తర్వాత సిట్ ఏర్పాటు చేసి మెరికల్లాంటి పలువురు అధికారులకు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారని ఆయన గుర్తుచేసుకున్నారు. దాదాపు ఐదు నుంచి ఆరు వేర్వేరు పద్ధతుల ద్వారా నిందితులను గుర్తించామన్నారు. ఈ కేసులో తొలుత మేము పంటి గాట్ల వంటి ఆధారాలను ఉపయోగించుకున్నాం. తగిన విధంగా డీఎన్ఏ శాంపిళ్లను సేకరించి, సరిపోల్చి చూశాం. నిర్భయ ఘటన జరిగిన మార్గం మొత్తాన్ని డిజిటల్ రూపంలో తయారు చేశాం... అని ఏసీపీ వెల్లడించారు. కేవలం నిందితులను అరెస్టు చేసినప్పుడు మాత్రమే కాకుండా.. దర్యాప్తు జరుగుతున్నన్ని రోజులూ సంబంధిత పోలీసు అధికారులు అన్ని విధాలా అందుబాటులో ఉన్నారని ఆయన గుర్తుచేసుకున్నారు. బాధితులు, సాక్షులు తమ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మేము జాగ్రత్త పడ్డాం. ఈ కేసును దర్యాప్తు చేసిన తీరుపై కోర్టు సైతం ప్రశంసలు కురిపించిందని ఆయన పేర్కొన్నారు. కాగా ఇవాళ ఉదయం దోషుల ఉరితీత సందర్భంగా నిర్భయ తల్లి కూడా అధికారులకు, న్యాయస్థానాలకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో ముగిసిన కమల్‌నాథ్ అంకం

బలపరీక్షకు ముందే రాజీనామాస్త్రం
15 నెలల్లో ఎంతో అభివృద్ధి చేశాను
బిజెపి కుయుక్తులకు బలయ్యానన్న కమల్‌నాథ్
రాజీనామా లేఖ గవర్నర్‌కు అందచేసిన కమల్‌నాథ్



భోపాల్,మార్చి20(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పాలన అంతమయ్యింది. కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్ర ముగిసింది. 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాతో మధ్య ప్రదేశ్ రాజకీయాల్లో కొద్దిరోజులుగా నెలకొన్న హైడ్రామాకి ఎట్టకేలకు తెరపడింది. అసెంబ్లీలో బలపరీక్షకు ముందే రాజీనామా చేస్తున్నట్టు ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ప్రకటించారు. సాయంత్రం 5 గంటల్లోగా బలపరీక్ష నిర్వహించాలంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఆయన రాజీనామా చేయడం గమనార్హం. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో కమల్‌నాథ్ మాట్లాడుతూ.. బెంగళూరులో ఎమ్మెల్యేలను నిర్బంధించడం వెనుక ఉన్న అసలు నిజమేంటో దేశప్రజలు త్వరలోనే తెలుసుకుంటారని అన్నారు.

అసలు నిజం బయటికి వస్తుంది. ప్రజలు వాళ్లను క్షమించరు. ప్రజలు నాకు ఐదేళ్లు పరిపాలించమని అధికారం ఇస్తే.. నన్ను ఎప్పుడు దించాలా అని బీజేపీ కుట్రలు పన్నుతూ వచ్చిందని ఆరోపించారు. గత 15 ఏళ్లుగా బీజేపీ చేయలేని అభివృద్ధిని తాను 15 నెలల్లో చేసి చూపించానని కమల్‌నాథ్ పేర్కొన్నారు.

అత్యాశపరులైన మా ఎమ్మెల్యేలతో బీజేపీ చేతులు కలిపింది. మా ఎమ్మెల్యేలను కర్ణాటకలో నిర్బంధించారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీ నమ్మక ద్రోహం చేసింది. మా ప్రభుత్వ పతనం కోసం బీజేపీ ఎదురుచూసింది. మధ్యప్రదేశ్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశా. రాష్ట్రానికి కొత్త రూపు ఇవ్వడానికి ప్రయత్నించాను. 15 ఏళ్లలో చేయలేని పనులను 15 నెలల్లో చేశానని ఆయన అన్నారు.

బీజేపీ తన సంకల్పాన్ని ఎప్పటికీ దెబ్బతీయలేదనీ.. మధ్యప్రదేశ్ ప్రజల కోసం తాను పనిచేస్తూనే ఉంటానని కమల్‌నాథ్ పేర్కొన్నారు. జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పడంతో ఆయనకు మద్దతుగా ఆ పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. దీంతో కమల్‌నాథ్ ప్రభుత్వం సంక్షోభంలో పడింది.

ఈ నెల 16న అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించాల్సి ఉన్నప్పటికీ... కరోనా వైరస్ కారణంగా సమావేశాలు ప్రారంభమైన రోజే సభను అర్థాంతరంగా వాయిదా వేస్తూ స్పీకర్ ప్రజాపతి నిర్ణయం తీసుకున్నారు. దీంతో కమల్‌నాథ్ ప్రభుత్వం మెజారిటీ కోల్పోయిందనీ... మధ్య ప్రదేశ్ అసెంబ్లీలో వెంటనే బలపరీక్ష నిర్వహించాలంటూ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, ఇతర బీజేపీ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో బలపరీక్షకు వెళ్లకుండానే ఆయన రాజీనామా చేసి, లేఖను గవర్నర్ టాండన్‌కు అప్పగించారు.

మానిసిక వ్యాధిగ్రస్తునికి టోకరా

క్షుద్రపూజల పేరుతో నగదు స్వాహా

భద్రాద్రి కొత్తగూడెం,మార్చి20 (ఆర్ఎన్ఎ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొందరు వ్యక్తులు చేసిన క్షుద్రపూజలు కలకలం రేపాయి. టేకులపల్లి మండల పరిధిలో గురువారం వెలుగుచూసింది. క్షుద్రపూజలు చేస్తే ఆరోగ్యం కుదుటపడుతుంది అని నమ్మి ఒక వ్యక్తి మోసగాళ్ల వలలో చిక్కుకున్నాడు. భారీగా నగదు పోగొట్టుకున్నాడు. మానసిక బాధతో బాధపడే షేక్ బకర్‌సిద్దిక్ ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన వ్యక్తి.కొన్ని రోజుల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరోగ్యం కూడా సరిగా లేదు. అయితే షేక్ కి టేకులపల్లి మండలానికి చెందిన కోరం రవీందర్ అలియాస్ సురేశ్‌తో పరిచయం ఏర్పడింది. షేక్ బకర్‌సిద్దిక్ మానసిక ఇబ్బందులను పసిగట్టిన రవీందర్ అతని దగ్గర డబ్బులు గుంజాలని భావించాడు. అందులో భాగంగానే ఒక ఘోరమయిన ప్లాన్ వేసాడు. అ ఎ÷-లాన్ లో భాగంగా క్షుద్రపూజలు చేసి ఇబ్బందులు తొలగిస్తాననీ షేక్ ని నమ్మబలికాడు. ఇందుకుగానూ ఖర్చు అవుతుందని తెలపడంతో, బకర్‌సిద్ధిక్ కూడా డబ్బు ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. మొత్తం రూ.1.75లక్షలకు ఒప్పందం చేసుకుని అడ్వాన్స్‌గా రూ.49,999 ఫోన్‌పే ద్వారా వంపించాడు. బుధవారం రాత్రి తడికలపూడి మార్గంలో బాధితుడిని ఓ నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి క్షుద్ర పూజలు ప్రారంభిచేందుకు సిద్ధమయ్యారు. అయితే పూజ ప్రారంభానికి ముందు మిగిలిన రూ.1.25లక్షలను కూడా ఇవ్వాలని కోరడంతో చేసేది లేక బకర్‌సిద్ధిక్ ఆ మొత్తాన్ని కూడా రవీందర్‌కు నగదు రూపంలో ఇచ్చాడు. ముందుగానే రవీందర్ ప్లాన్ తో అక్కడకి వచ్చాడు. పూజ ప్రారంభిస్తున్న సమయంలో రవీందర్ ప్లాన్ ప్రకారం కొందరు వ్యక్తులు పొదల మాటు నుంచి వచ్చి వారిపై దాడి చేశారు. దీంతో రవీందర్, బకర్‌సిద్ధిక్ చెరో దిక్కుకు పారిపోయారు. పూజా ఆగిపోయింది. బాధితుడు భయంతో టేకులపల్లి చేరుకుని తనకు జరిగిన ఘటనను స్థానికులకు చెప్పి ఆవేదన చెందాడు. స్థానికులు వెళ్లి చూస్తే పూజా సామాగ్రి తప్ప, వ్యక్తులు కనిపించలేదు. ఫోన్‌పే ద్వారా రూ.49,999, నగదు రూపంలో రూ.1.25లక్షలు ముట్టజెప్పినట్లు వివరించారు. దీంతో స్థానికులు టేకులపల్లి ఎస్సై ఇమ్మడి రాజ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు.

తదుపరి విచారణ ఏప్రిల్ 9న

హాజరయిన రాజగోపాల్, మన్మోహన్‌సింగ్

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నాంపల్లి సీబీఐ, ఈడీ కోర్టులో జగన్ అక్రమాస్తుల కేసు విచారణ జరిగింది. నేటి విచారణకు కేసులో ప్రధాన నిందుతులుగా ఉన్న ఐఎఎస్ అధికారి మన్మోహన్‌సింగ్, రాజగోపాల్ హజం´య్యారు. వారిని విచారించిన అనంతరం న్యాయస్థానం ఈ కేసుకు సంబందించి తదుపరి విచారణను ఏప్రిల్ 9న చేపడతామని తెలిపింది. కాగా ఈ కేసులో నిందితులుగా గతంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు ఎంపీ విజయసాయి రెడ్డి, శ్యామ్ ప్రసాద్‌లు కూడా హజరయ్యారు

కరోనా నేపథ్యంలో ప్రజల్లో భయం

బహిరంగంగా తుమ్మినందుకు చితకబాదాడు

ముంబయి,మార్చి20(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రద్దీ ప్రాంతాల్లోకి వెళ్లేందుకు కూడా జనాలు సాహసం చేయడం లేదు. ఒక వేళ వెళ్లినప్పటికీ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కరోనా సోకకుండా ఉండేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఓ యువకుడు తన బైక్‌పై వెళ్తూ బహిరంగ ప్రదేశంలో తుమ్మాడు. కరోనా భయం వెంటాడుతున్న సమయంలో బహిరంగంగా ఎందుకు తుమ్మావ్ అని ప్రశ్నిస్తూ అతడిని మరో వ్యక్తి చితకబాదాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని కొల్హాపూర్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. కొల్హాపూర్ పట్టణంలోని గుజరాయి ఏరియాలో ఓ యువకుడు తన బైక్‌పై వెళ్తున్నాడు. ప్రయాణిస్తూనే రోడ్డుపై తుమ్మాడు. దీంతో ఆ యువకుడిని మరో వ్యక్తి ఆపి.. బహిరంగ ప్రదేశంలో ఎందుకు తుమ్మావ్? అని ప్రశ్నించాడు. కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న క్రమంలో జాగ్రత్తలు తీసుకోవా? చేతి రుమాలు అడ్డం పెట్టుకుని తుమ్మొచ్చు? కదా అని ప్రశ్నల వర్షం కురిపించాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులంతా గుమిగూడారు. ఇంతలోనే తుమ్మిన వ్యక్తిని మరో వ్యక్తి కొట్టాడు.

అయితే ఈ ఘటన అక్కడున్న సీసీకెమెరాల్లో రికార్డు అయింది. ఇప్పుడు ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ వీడియోపై పోలీసులు స్పందిస్తూ.. తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. ఉమ్మివేయడం, తుమ్మడం, దగ్గు ద్వారా ఈ వైరస్ సోకుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

కరోనా మృతుల్లో చైనాను మించిపోయిన ఇటలీ

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాలకు వ్యాప్తి చెందింది. కరోనా మరణాల్లో ఇటలీ చైనాను మించిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్‌తో 10,048 మంది మృతి చెందారు. ఇటలీలో 3,433 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా బాధితుల సంఖ్య 2.45 లక్షలకు చేరితే, ఒక్క ఇటలీలోనే 41 వేల మందికి పైగా కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఇటలీలో గడిచిన 24 గంటల్లో 427 మంది మృతి చెందారు. చైనాలో వరుసగా రెండో రోజూ కొత్తగా కరోనా కేసులు నమోదు కాలేదు. ఇరాన్‌లో 1,284, స్పెయిన్‌లో 831, ఫ్రాన్స్‌లో 372, అమెరికాలో 218, యూకేలో 144, దక్షిణ కొరియాలో 94, నెదర్లాండ్స్‌లో 76, జర్మనీలో 44, స్విట్జర్లాండ్‌లో 43 మంది మృతి చెందారు. ఇండియాలో కరోనా కేసుల సంఖ్య 195కు చేరుకోగా, మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

కరోనా వివాదంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కొమరం భీం,మార్చి20(ఆర్ఎన్ఎ): అప్పట్లో ఫారెస్ట్ ఆఫీసర్‌పై దాడికి పాల్పడిన ఘటనలో వార్తల్లో నిలిచిన సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప.. మరో వివాదంలో చిక్కుకున్నారు. కరోనా విషయంలో కోనప్ప తీరు చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 16న కోనప్ప దంపతులు అమెరికా నుంచి వచ్చారు.

అయితే క్వారంటైన్‌లో ఉండకుండా మరుసటి రోజే మున్సిపల్ సమావేశంలో పాల్గొనడం విమర్శలకు తావిస్తోంది. బంధువులు, సన్నిహితుల ఇళ్లలో జరిగిన సత్యనారాయణస్వామి వ్రతం, వివాహాలకు హాజరయ్యారు. అయితే శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కోనప్ప దంపతులకు అన్ని పరీక్షలు చేశారు. ఆరోగ్యంగా ఉన్నందున క్వారంటైన్‌లో ఉండాల్సిన అవసరం లేదనేది కోనప్ప వాదనగా తెలుస్తోంది.

పరీక్ష కేంద్రాల్లో శానిటైజేషన్

స్వయంగా పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం 10వ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

బోరబండ, యూసుఫ్‌గూడ పరీక్ష కేంద్రాల్లో పర్యటించారు. విద్యార్థులకు అత్యంత భద్రత మధ్య కరోనా వైరస్ విస్తరించకుండా సీటింగ్ సదుపాయం కల్పించారా అని విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, టీచర్లకు ఏర్పాటు చేసిన బెంచీలు, కుర్చీలు డెటాల్‌తో శుభ్రంగా తుడవాలని ఆదేశించారు. విద్యార్థులు కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా శానిటైజర్‌తో గాని, సబ్బుతో గాని, ఇతర లిక్విడ్‌లతో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మాస్క్‌లు, వాటర్ బాటిల్ శానిటైజర్లను క్లాస్ రూమ్‌లోకి అనుమతించాలని ఆదేశించారు.

మంత్రి ఈటల రాజేందర్‌కు కేటీఆర్ బర్త్‌డే శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 20: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు.. ఐటీ మినిస్టర్ కేటీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ప్రజా సేవలో మరింత కాలం ఉండాలని కేటీఆర్ పేర్కొన్నారు. ఈటల రాజేందర్‌కు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలు

సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు,మార్చి20(ఆర్ఎన్ఎ): వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభంలో ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రివిలైజ్ కమిటీ చైర్మన్‌గా చర్యలు తీసుకుంటానని సర్వేపల్లి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవన సముదాయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ దామోదరనాయుడు ఎలా ప్రారంభించేందుకు ప్రయత్నించారో అధికారులు వివరణ ఇవ్వాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చుతున్న విషయాన్ని గుర్తుచేశారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా వీసీ తన ఇష్టానుసారంగా భవన సముదాయాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించడం ముమ్మాటికి ప్రొటోకాల్ ఉల్లంఘనేనన్నారు. ప్రొటోకాల్‌పై కొత్త జీఓను అధికారులకు చదివి వినిపించి వీసీకు ప్రొటోకాల్ ఉందాని ప్రశ్నించారు. ప్రివిలైజ్ కమిటీ చైర్మన్‌గా సంబంధిత శాఖ అధికారులకు నోటీసులను జారీ చేస్తామన్నారు. భవన నిర్మాణం నాణ్యతపై విజిలెన్స్ తనిఖీలను చేయిస్తామన్నారు. భవనం అంచనా విలువల్లో 2.75 శాతం అదనంగా కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు చేశారని తెలిపారు. భవన నిర్మాణానికి రూ.1.70కోట్లు మంజూరు చేశారని, భవనాన్ని ప్రారంభించేందుకు శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి తర్వాత తొలగించారన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో అప్పటి రాపూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, మాజీ సమితి అధ్యక్షుడు కాకాణి రమణారెడ్డి, తాను ఎంతో వ్యయప్రయాసలకోర్చి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించామన్నారు. వైఎస్సార్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

సోమిరెడ్డికి కమీషన్లు దండుకోవడమే తెలుసునులు మంజూరు చేయించికాంట్రాక్టర్లను పిలిపించుకుని సెటిల్‌మెంట్లు చేసి కమీషన్లు దండుకోవడమే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తెలుసునని, అభివృద్ధి అంటే అసలు తెలియదని ఎమ్మెల్యే కాకాణి దుయ్యబట్టారు. అందులో భాగంగానే పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని మంజూరు చేశారన్నారు. కండలేరు ఎడమగట్టు కాలువ లిఫ్ట్‌ఇరిగేషన్ స్కీమ్‌కు రెండు మోటార్లు ఏర్పాటు చేస్తే అందులో ఒకటి అసెంబుల్డ్ మోటారని ఆనాడే చెప్పానని, అదే మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. 28 రోజులుగా గ్రావిటీ తగ్గిన కాలువకు 130 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నది ఒక్క మోటారుతోనేనన్నారు. మోటార్ల ఏర్పాటులో సోమిరెడ్డి కమీషన్ల భాగోతానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలన్నారు. సమగ్ర విచారణ జరిపిస్తే అధికారులు ఇబ్బందులు పడక తప్పదన్నారు. సోమిరెడ్డి ఎంత గింజుకున్నా ఆక్రమణల తొలగింపును అడ్డుకోలే డన్నారు. చెరువు సప్లయి ఛానల్‌ను అడ్డగించి ఇళ్లు నిర్మిస్తుండగా అధికారులు తొలగించేందుకు వెళ్లారన్నారు. ఆక్రమణల తొలగింపునకు రాజకీయ రంగు పులిమి వైఎస్సార్‌సీపీపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. కాలువ గట్టున ఉన్న ఆక్రమణలను తొలగించి తీరుతామని, దమ్ముంటే అడ్డుకోవాలన్నారు. తాను తెలిసి ఎవరికీ అన్యాయం చేయనని, ప్రజాప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తానని వెల్లడించారు. సోమిరెడ్డి తాటాకు చప్పళ్లకక్రు బెదిరేది లేదని, సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధిని ఐదు పర్యాయాలు ఓడిన ఘనాపాటి సోమిరెడ్డి అడ్డుకోలేడన్నారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, రావుల దశరథరామయ్యగౌడ్, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, తెనాలి నిర్మలమ్మ, వాకాటి శ్రీనివాసులురెడ్డి, వూకోటి లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

కరోనా సాకుతో ధరలు పెంచితే కఠిన చర్యలు

నిత్యావసరాలకు కొరత లేదు
షాపులు తెరిచే ఉంటాయి...వాటిపై ఆంక్షలు లేవు
కరోనాపై తప్పుడు ప్రచారం చేసినా శిక్ష
అధికారులతో సమీక్షలో సిఎం వైఎస్ జగన్

అమరావతి,మార్చి20(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం వైరస్ ప్రబలుతున్న క్రమంలో...నోటూ పానిక్... ఎస్ టూ ప్రికాషన్స్ అన్నది నినాదంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. ఆందోళన వద్దు.. జాగ్రత్తలతోనే రక్షణ ఉంటుదనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. తెలియని సమాచారం ఇచ్చినా, తప్పుడు సమాచారం ఇచ్చి ప్రజలను ఆందోళనకు గురి చేస్తే మాత్రం గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరోనా వైరస్ నిరోధం, ఇళ్ల పట్టాలపై జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన అధికారులకు దిశా నిర్దేశం చ